



నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

రంగారెడ్డి వికారాబాద్ మేడ్చల్

బుధవారం 18 మార్చి 2026 పేజీలు 16


# అడవిలో అర్ధరాత్రి షూటింగ్

## ఫారెస్టు అధికారుల వాటా ఎంత...?



భారీ లైట్లతో కొనసాగుతున్న షూటింగ్



రాత్రి షూటింగ్‌కు ఏర్పాటు చేసిన ఎల్ఈడి లైట్లు

- జంతువులకు రక్షణ కల్పించాల్సిన అధికారులే అమ్ముడుపోతున్నారా..?
- అర్ధరాత్రి షూటింగ్ వల్ల జంతువులకు, పక్షుల స్వేచ్ఛకు బంగం
- అనంతగిరి ఫారెస్టులో మూగబోతున్న మూగజీవులు
- అడవులలో రాత్రివేళ్లలో షూటింగ్ నిషేదం–

### అనంతగిరిలో అమలు కాని ఇండియన్ ఫారెస్టు యాక్ట్..

**వికారాబాద్, మేజర్‌న్యూస్ (మార్చి 17)॥** అనంతగిరి అడవిలో మూగజీవులు కన్నీరు పెట్టుకుంటున్నాయి. వాటికి రక్షణ కల్పించాల్సిన అధికారులే అమ్ముడుపోయి వాటికి నరకం చూపిస్తున్నారు. రాత్రి వేళ్లలో స్వేచ్ఛగా తిరిగే అడవి జంతువులు బిక్కుబిక్కుమని ఘోషపడుతున్నాయి. ఫారెస్టు అధికారుల నిర్లక్ష్యం వల్ల అనంతగిరి అడవిలో మూగజీవులు రోజు రోజుకు కనుమరుగు అవుతున్నాయి. తాజాగా అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ రాత్రి వేళల్లో సినిమా షూటింగ్లు నిర్వహిస్తున్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. అడవి జంతువులు, పక్షుల సంరక్షణ కోసం



## ఉపవాస దీక్షలతో ఇఫ్తార్ విందులు

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

జల్ పల్లి, మేజర్ న్యూస్ (మార్చి 17): రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలతో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం మత సామరస్యానికి ప్రతీక అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి జల్ పల్లి సర్కిల్ జల్ పల్లి గ్రామంలో సౌద్ పటేల్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సయీద్ పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా సబితా ఇంద్రారెడ్డి పాల్గొని, ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్లు అందజేసి, ఉపవాస దీక్షలను

మిగతా 3లో

## ప్రజల సమస్యలపై బిఆర్ఎస్ పాదయాత్ర





**మణికొండ, మేజర్ న్యూస్ (మార్చి 17)॥** ప్రజల సమస్యలు తెలుసుకు నేందుకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మణికొండ పరిధిలోని శివపురి కాలనీలో మీ సమస్య మా భాధ్యత కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. అ సందర్భంగా సిసి రోడ్లు మరియు డ్రైనేజి సమస్యలను, మ్యాన్‌హోల్‌లను విచ్చల విడిగా వదిలేసిన

మిగతా 3లో

## మున్సిపాలిటీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



**చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి17)॥** మున్సిపాలిటీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 15,16 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ బండారి శైలజాఆగిరెడ్డితో కలిసి మంగళవారం పర్యటించి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. వార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక

మిగతా 3లో

## ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ పెద్దేముల్ ఆర్ఐ రిచర్డ్ సైమన్

- మోటేషన్ ఫైల్ కోసం గుడిమల్కాపూర్‌లో రూ.15 వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఆర్ఐ



ఆర్ఐ రిచర్డ్ సైమన్

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (మార్చి 17):** ఓ మోటేషన్ ఫైల్ ను పూర్తి చేసేందుకు రూ. 15000 వేలు లంచం తీసుకుంటూ పెద్దేముల్ ఆర్ఐ రిచర్డ్ సైమన్ మంగళవారం రాత్రి నగరంలోని గుడిమల్కాపూర్ ప్రాంతంలో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు పెద్దేముల్ తహసిల్దార్ కార్యాలయంలో కూడా సోదాలు చేసి విచారణ చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## శ్రీమల్లికార్జున లేఅవుట్

# భూ 'మాయ'

- 1992 నాటి పబ్లిక్ స్థలం... 2026లో ప్రైవేట్ ప్లాట్లు
- పట్టణ ప్రణాళిక అధికారులు నిద్రపోతున్నారా? లేక ముడుపుల మత్తులో ఉన్నారా?






శ్రీ మల్లిఖార్జున లేఔట్ లోని కాళీ స్థలంలో అక్రమ నిర్మాణం

**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (మార్చి, 17)॥** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్, శామీర్‌పేట మున్సిపల్ డివిజన్ పరిధిలోని దేవర యాంజల్ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 538, 539, 540 మరియు 561, 562, 564లో ఉన్న శ్రీ మల్లికార్జున లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఖాళీ స్థలంపై అక్రమ దస్తావేజులు సృష్టించి కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

1992లో రూపొందించిన లేఅవుట్ ప్లాన్‌లో 'ఓపెన్ స్పేస్'గా వదిలిన ఈ స్థలం ప్రస్తుతం రియల్ ఎస్టేట్ మాఫియా లక్ష్యంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఓపెన్ స్పేస్‌పై కన్నేసిన భూబకాసురులు..!**

ప్రతి లేఅవుట్‌లో 10 నుండి 15 శాతం స్థలాన్ని పార్కులు, ఆట స్థలాలు, కమ్యూనిటీ అవసరాల

మిగతా 3లో

సూర్య
www.suryaa.com
బుధవారం
18 మార్చి 2026

## హైదర్ షాకోట్ వార్డ్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడుపై అధికారుల బెదిరింపులు



గండిపేట్ మేజర్ న్యూస్ (మార్చ్17) రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన హైదర్ షాకోట్ డివిజన్ వార్డ్ కార్యాలయంలో మంగళవారం ఇంటి నెంబర్ కొరకు అర్జీ పెట్టుకోవడానికి వెళితే. కార్యాలయంలో ఉన్న ఏఎంసి రమేష్ కుమార్ అర్జీ దారుడు పై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దరఖాస్తు పత్రాలను విసిరి పడేశాడు అని ఫిర్యాదుదారుడు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన బంధువులకు సంబంధించిన ఇంటి నెంబర్ కొరకు హైదర్షకోట్ వార్డ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడానికి వెళ్లానని అన్నారు. కార్యాలయంలో ఉన్న సిబ్బంది తమ ఉన్నతాధికారికి సూచించాలని తెలపడంతో. అక్కడే ఉన్న అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ కు ఇంటి నంబర్ల దరఖాస్తు పత్రాలను అందజేయడానికి వెళ్లగా. అధికారి తనపై ఒక్కసారిగా గర్జిస్తూ తన పైకి లేచాడన్నారు. ఏకవచనంతో దుర్భాషలాడుతూ నీ ఫిర్యాదును తీసుకోను నీకు నచ్చిన చోట చెప్పుకో పో.. అని పత్రాలను కింద పడేసాడని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం అసభ్య ప్రవర్తన ప్రవర్తించకూడదని తెలిసిన కొంతమంది అధికారుల కారణంగా పూర్తి వ్యవస్థపై మచ్చ తెస్తున్నారన్నారు. ఈ విషయంలో జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు : శాస్త్రవేత్తలు సందీప్, గౌతమ్




ఆమనగల్లు మేజర్ న్యూస్ (మార్చ్ 17) ప్రకృతి వ్యవసాయంతో రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని కె వి కే శాస్త్రవేత్తలు సందీప్, గౌతమ్ లు చెప్పారు. మంగళవారం ఆమనగల్లు రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్ లో భాగంగా నిర్వహించిన శిక్షణ శిబిరంలో రైతులకు వారు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తో పాటు పర్యావరణాన్ని రక్షించవచ్చని తెలిపారు. కిట్ల లో జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం తయారీకి అవసరమైన పదార్థాలు, సూచనలు అందుబాటులో ఉంచినట్లు వారు వివరించారు. రైతులు కిట్లను సమర్థవంతంగా వినియోగించి ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరణలో పెట్టాలని సూచించారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ, సాంకేతిక సూచనలు, ప్రభుత్వ సహాయం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బాలకృష్ణ,ప్రభావతి మరియు రైతులు పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్ కార్పొరేషన్‌పై అవినీతి మబ్బులు

**- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: యువమోర్చా నేత రామిడి శూరకర్ణ రెడ్డి**

**- "కాంగ్రెస్‌బీఆర్ఎస్ ఒకే తాటిపై అవినీతి పంచుకుంటున్నారనీ ఆరోపణలు**

బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 17): బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అవినీతికి కేంద్ర బిందువుగా మారిందని యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిడి శూరకర్ణ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కార్పొరేషన్ ఏర్పాటై నప్పటి నుంచి అవినీతి ఆరోపణలు వరుసగా వెలువడుతున్నా, పరిస్థితిలో మార్పు కనిపించడంలేదని విమర్శించారు.గతంలో అవినీతి అధికారులను ఏసీబీ అధికారులు పట్టుకుని జైలుకు పంపించిన ఘటనలు ఉన్నప్పటికీ, అదే అధికారులు తిరిగి ప్రమోషన్లు పొందడం అవినీతి పెరుగు
దలకు కారణమవుతోందని అన్నారు.శిక్షల బదులు ప్రోత్సాహం లభిస్తే అవినీతి ఎలా ఆగుతుంది..,అని ప్రశ్నించారు...?.గత ఆరు సంవత్సరాలుగా కార్పొరేషన్ పరిధిలో పార్కులు, ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులు, ఎల్ఆర్ఎస్, డోర్ నెంబర్లు, సాధారణ బడ్జెట్ నిధుల వినియోగం వంటి అంశాల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజా ధనం దారి మళ్లింపుపై అనేకసార్లు ఫిర్యాదులు వచ్చినా, ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ఈ మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గత ఆరు సంవత్సరాల్లో పనిచేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల పాత్రను పూర్తిగా బయట పెట్టాలని కోరారు. అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ నాయకుల అవినీతి బయటపెట్టి జైలుకు పంపిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు, రెండు సంవత్సరాలు గడిచినా ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇటీవల బడంగ్‌పేట్ సర్కిల్‌లో జరిగిన ఏసీబీ దాడులు, కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతికి స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, అవినీతి అధికారులపై మరియు వారిని ప్రోత్సహిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సొమ్మును దోచుకునే వ్యవస్థను కూల్చకపోతే, ప్రజలే సిద్ధమవుతారు అంటూ రామిడి బీజేపీ శూరకర్ణ రెడ్డి ఘాటుగా హెచ్చరించారు.



## ప్రజలకు మౌలిక వసతుల కల్పన, గ్రామాభివృద్ధే పాలకవర్గ లక్ష్యం

**★గ్రామస్థుల వినతి మేరకు ఆర్కపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో వైకుంఠధామంలో కంపచెట్ల తొలగింపు**



మాడ్గుల, మేజర్‌న్యూస్ (మార్చి 17): మాడ్గుల మండలం ఆర్కపల్లి వైకుంఠధామంలో కంపచెట్లు పెరిగి అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు స్థానికులు సర్పంచ్, పాలకవర్గం దృష్టికి తేవడంతో గ్రామ సర్పంచ్ కల్లు భాగ్యలక్ష్మితిరుపతిరెడ్డి ఉపసర్పంచ్ తోలు రవీందర్‌లు మంగళవారం కంపచెట్ల తొలగింపుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు పంచాయతి సిబ్బంది, స్థానికులతో కలిసి వారు జెసిబి యంత్రం సహాయంతో కంపచెట్లు, చెత్తను తొలగింపజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యలక్ష్మితిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధే లక్ష్యంగా పంచాయతి పాలకవర్గం శాయశక్తులా కృషిచేస్తున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికతో గ్రామంలోని అన్ని వార్డుల్లో ప్రజల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కాంగ్రెస్ పెద్దల సహకారంతో ప్రజలకు మౌళిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారంతో పాటు అవసరమైన చోట్ల నూతనంగా సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ భాగ్యలక్ష్మితిరుపతిరెడ్డి వివరించారు. అదేవిధంగా గ్రామపంచాయతి పరిధిలోని ఆర్కపల్లి నుండి జర్పులతాండ, ఆర్కపల్లి నుండి రమణం పల్లి ( సాగర్‌రోడ్డు ) మట్టిరోడ్లను అభివృద్ధి చేసేలా చూస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోలు రవీందర్, పంచాయతి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

**- మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్**




చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి17)ః రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని రైతు వేదికలో రైతుభరోసా దరఖాస్తులను మంగళవారం స్వీకరించారు. ఫిబ్రవరి 28లోపు కొత్తగా రిజిస్ట్రేషన్ అయినా రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 25చివరి ఉంటుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

**-హస్తేపూర్ సర్పంచ్ జ్యోతిభూపాల్‌గౌడ్**



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి17)ః పాడిరైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని హస్తేపూర్ సర్పంచ్ జ్యోతిభూపాల్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని హస్తేపూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.... పశువుల ఆరోగ్య పరిరక్షణకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పక వేయించాలని సూచించారు. గాలికుంటు టీకాలు వేయించకుంటే పశువుల ఎదుగుదల తగ్గి పాల ఉత్పత్తితో పాటు ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పశువైద్యులు, రైతులు తదితరులు ఉన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్‌కు విరాళం




చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి17)ః చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద 9వార్డులో ఈనెల 28,29న జరిగే వాలీబాల్ జిల్లా టోర్నమెంట్‌కు కాంగ్రెస్ పార్టీ యువనాయకులు నడిమోళ్ల మహేందర్ రూ.11వేలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు, వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

## ధర్మా తండా గ్రామపంచాయతీ పరిధిలోని సూర్య పాలిత్య తండాలో విద్యుత్ స్థంబాల ఏర్పాటు

**- సర్పంచ్ చందు నాయక్**



జిల్లేడు- చౌదరి గూడెం: మేజర్ న్యూస్:( మార్చి:17): మండల పరిధిలోని ధర్మా తండా గ్రామపంచాయతీ పరిధిలోని సూర్య పలిత్య తండాకు విద్యుత్ సరఫరా కోసం నూతన విద్యుత్ స్థంబా లను బిగుస్తున్న మండల విద్యుత్ ఏ. ఈ నర్సింహులు చొరవతో ఈ రోజు విద్యుత్ లైన్ క్లియర్ అయింది అని సర్పంచ్ చందు నాయక్ తెలిపారు. తండాకు విద్యుత్ సరఫరా వస్తున్నందుకు తండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు అని చందు నాయక్ తెలిపారు.

## ఉపవాస దీక్షలతో ఇఫ్తార్ విందులు



వొందవ టి పేజీ తరువాయి...

వివరింప చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో నెల రోజులు కటోర ఉపవాస దీక్షలు పాటిస్తారన్నారు. సమాజంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని అల్లాని వేడుకుంటారని తెలిపారు. నెల రోజుల ఉపవాస దీక్షలో అనేక సత్ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో జల్ పల్లి మాజీ కోఆప్షన్ సభ్యులు సూర్ రెడ్డి కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్, బిఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షులు షేక్ అప్జల్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, బిఆర్ఎస్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజలా అర్జున్, నాగేష్ ముదిరాజ్, అబ్బాస్, నజీబ్, సైఫ్ పటేల్, సౌద్ పటేల్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై బిఆర్ఎస్ పాదయాత్ర

మొదటిపేజీ తరువాయి...

సంఘటనలను గురించి తెలుసుకున్నారు. ఓపెన్ స్పెస్ మరియు కమ్యూనిటీ హాల్ సమస్య గురించి మాట్లాడుతూ లే అవుట్‌లో స్పష్టంగా గుర్తించిన ఓపెన్ స్పెస్ ఉన్నప్పటికి, గత మున్సిపాలిటీ గాని ప్రస్తుత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కాని అట్టి స్థలాన్ని స్వాదీనం చేసుకొ లేదు. చాలా కాలంగా కమ్యూనిటి హాల్ నిర్మాణం కోసం డిమాండ్ చేస్తున్నారని నిర్మాణానికి త్వరగా చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ సమస్యలు, నాళాల సమస్యలు, ఆర్టిఏ కార్యాలయం ట్రాఫిక్ సమస్యను వివరించారు. ఈ సమస్యలన్నింటిని సంబంధిత అధికారులను కలిసి పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారాం దూళిపాళ, కుంభగళ్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, ఏర్పుల శ్రీకాంత్, సంగం శ్రీకాం త్, యాలల కిరణ్, జైరామ్, భానుచందర్, సుమనళిని, రాజేంద్రప్రసాద్, బొడ్డు శ్రీధర్, తిరుపతి, మంజు, దేవి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి...

99రోజుల ప్రణాళికతో పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. మున్సిపల్ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఇంటి పరిసరాలతో పాటు వార్డు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వివరించారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మెన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు దావల్గారి గోపాల్‌రెడ్డి, మద్దెల శ్రీనివాస్, కృష్ణానాయక్, ముడిమ్యాల సొసైటి మాజీ చైర్మెన్ గోనె ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్, మార్కెట్ కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్ గడ్డమీది పెంటయ్యగౌడ్, బ్యాగరి రాములు, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, భీమయ్య, నాయకులు మల్గారి మల్లారెడ్డి, అత్తెల్లి రవీందర్‌రెడ్డి, గుత్తి మల్లేష్ ,వెంకట్‌రెడ్డి, బండారి శ్రీకాంత్‌రెడ్డి, పాటి దామోదర్‌రెడ్డి, గణేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

## కుల్కచర్ల మండల ప్రీమియర్ లీగ్-2026 క్రికెట్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధం..

**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (మార్చి 17):** ఎగ్రామీణ ప్రాంత క్రికెట్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు మండలం ప్రీమియర్ లీగ్ (పీూా)-2026 పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేపట్టారు. ఈ టోర్నమెంట్‌లో కుల్కచర్ల, దోమ, గండీడ్, మహమ్మదాబాద్, చౌడపూర్ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనే అవకాశముంది. ప్రతి ఒక్క క్రీడాకారుడు ఈనెల 20 వరకు వ్యక్తిగతంగా రూ.1000 చెల్లించి వారి పేరును నమోదు చేసుకోవాలన్నారు. పోటీలు 10 ఓవర్ల మ్యాచ్‌లుగా నిర్వహించబడ తాయి. ప్రతి మ్యాచ్‌కు ముగ్గురు అంపైర్లు విధులు నిర్వహించనున్నారు. టోర్నమెంట్ విజేత జట్టుకు ట్రోఫీతో పాటు మొదటి బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లకు కొన్ని నిబంధనలు కూడా విధించారు. ప్రతి జట్టు ఆటగాళ్లు నిర్దిష్ట బౌలింగ్ కోటాను పాటించాల్సి ఉంటుంది. అలాగే మ్యాచ్‌ల సమయంలో జెర్సీ ధరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9959958530,9494511756, 9951507890, 9705555459, 9959906881 నంబర్లను సంప్రదించవచ్చని నిర్వాహకులు సంతోష్, మురళి, యాదగిరి, రమేష్, తిరుపతి, నరేష్ , రవి తెలిపారు.

# అడవిలో అర్ధరాత్రి షూటింగ్

మొదటిపేజీ తరువాయి...

అమల్లో ఉన్న ఇండియన్ ఫారెస్టు యాక్టు 1927 ప్రకారం రాత్రి సమయంలో అడవిలో ఎటువంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వకూడదు.

అయితే అనంతగిరి ఫారెస్టులో మంగళవారం రాత్రి అనంతగిరి స్వామి గుండాల వద్ద భారీ లైటింగ్, డీజే సౌండ్లు, వందలాది మంది సిబ్బంది, భారీ వాహనాలతో షూటింగ్‌లు నిర్వహిస్తున్నారు. వికారాబాద్ జిల్లా ఫారెస్టు కార్యాలయంలో కూతవేటు దూరంలో అర్ధరాత్రి ధర్జగా సినిమా షూటింగ్‌లు నిర్వహించడం ఆశ్చర్యకరం. దీని వల్ల అడవి జంతువులు, పక్షులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సినిమా షూటింగ్ పరిసర ప్రాంతంలో పెద్ద పెద్ద సౌండ్‌లు, లైటింగ్‌లు పెట్టడం వల్ల జంతువులు రోడ్డు పైకి వచ్చి ప్రాణాలను కోల్పోయిన సంఘనలు ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇటువంటి కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వడం చాలా అరుదు. అయినప్పటికీ అనంతగిరి ప్రాంతంలో మాత్రం ఎలాంటి అధికారిక పత్రాలు లేకుండానే షూటింగ్‌లు జరుగుతుండడంతో ఫారెస్ట్ శాఖ అధికారులపై వ్యక్తం అవుతున్న అనుమానాలకు బలం చేకూరుతుంది.

**అర్ధరాత్రి షూటింగ్‌లకు అనుమతి లేదుః డిఎఫ్ఓ జ్ఞానేశ్వర్**



రాత్రి వేళ్లలో రిజర్వ్యూ ఫారెస్టులో షూటింగ్‌లు నిషేదం. అర్ధరాత్రి షూటింగ్ నిర్వహిస్తున్నారని తమకు సమాచారం లేదు. అడవి జంతువులకు ఇబ్బంది కరంగా షూటింగ్ నిర్వహిస్తే వెంటనే ఫారెస్టు సిబ్బందితో షూటింగ్‌ను నిలిపివేయడం జరుగుతుంది. నిబంధనల ప్రకారమే షూటింగ్ నిర్వహించుకోవ్వాలి ఉంటుంది.

**అర్ధరాత్రి షూటింగ్‌కు డిఎఫ్ఓ జ్ఞానేశ్వర్ అనుమతించారు..?ః ఎఫ్ఆర్ఓ శ్యామ్‌కుమార్**



అర్ధరాత్రి అనంతగిరి అడవిలో షూటింగ్‌లు నిర్వహించడం నిషేదం. కాని మంగళవారం రాత్రి జరిగిన షూటింగ్‌కు మాత్రం డిఎఫ్ఓ అనుమతి ఇచ్చారు. తనకు ఎలాంటి సంబందం లేదు. షూటింగ్ నిర్వహకులు కేవలం సాధారణ అనుమతులు మాత్రమే తీసుకున్నారు. కాని రాత్రి వేళ్లలో షూటింగ్ చేసేందుకు ప్రత్యేక అనుమతులు ఇవ్వలేదు. ఫారెస్టు యాక్టు ప్రకారం అర్ధరాత్రి షూటింగ్ నిర్వహించడంతో అడవి జంతువుల స్వేచ్ఛకు బంగం కలిగించినట్లు అవుతుంది. అందుకు గాను ఆ షూటింగ్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదు. కాని అర్ధరాత్రి షూటింగ్ జరుగుతుందని డిఎఫ్ఓ జ్ఞానేశ్వర్ తెలిసినప్పటికి షూటింగ్‌ను నిలిపివేయాలని ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఆయన చూసి చూడనట్లు ఉండడం చేతనే అర్ధరాత్రి షూటింగ్ కొనసాగుతుంది.

# శ్రీమల్లికార్జున లేఅవుట్ భూ 'మాయ'

మొదటిపేజీ తరువాయి...

కోసం కేటాయించడం నిబంధన. శ్రీ మల్లికార్జున లేఅవుట్ ప్లాన్‌లో కూడా ఇదే విధానం అమలులో ఉంది. అయితే, పై సర్వే నంబర్లలో ఉన్న ఓపెన్ స్పేస్‌ను అక్రమంగా కబ్జా చేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రికార్డుల గ్యాప్‌ను ఆయుధంగా**

1990వ దశకంలో భూ రికార్డులు పూర్తిగా డిజిటల్‌లో లేకపోవడం వల్ల ఏర్పడిన లోపాలను అక్రమార్కులు తమకు అనుకూలంగా మలుచుకున్నట్లు తెలుస్తోంది. లేఅవుట్ అసలు యజమానులు లేదా వారి వారసుల పేరుతో నకిలీ అమ్మకపు ఒప్పందాలు సృష్టించి, ఫోర్జరీ సంతకాలతో లింక్ డాక్యుమెంట్లు తయారు చేసి ప్లాట్లుగా విక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త సర్వే నంబర్లు లేదా సబ్-డివిజన్లు సృష్టించి అసలు లేఅవుట్‌కు సంబంధం లేనట్లు చూపుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యమా- లేక కుమ్మక్కా**

ప్రజా స్థలం అని తెలిసినా సరైన విచారణ లేకుండా రిజిస్ట్రేషన్లు ఎలా జరుగుతున్నాయి అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ' జాబితాలో ఉండాల్సిన భూమి ఎలా బయటకు వచ్చింది అన్నది అనుమానాస్పదంగా మారింది. ఈ వ్యవహారం ఒక్కరోజులో జరిగినది కాకుండా, దీని వెనుక బలమైన సిండికేట్ పని చేస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రజావాణిలో ఫిర్యాదు అధికారుల కదలికలు:**

ఈ వ్యవహారంపై సోమవారం కీసర మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నర్సింగ్ రావు గౌడ్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ వసంత, శామీర్‌పేట డివిజన్ పట్టణ ప్రణాళిక అధికారులు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌లు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అక్రమాలను అరికట్టి, ఆ స్థలాన్ని భవిష్యత్ తరాలకు మరియు కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని డివిజన్ వాసులు కోరుతున్నారు.



తూము కుంట మున్సిపాలిటీ 11వ వార్డు మాజీ కౌన్సిలర్ పి. నర్సింగరావు గౌడ్

**సామాన్యులకు ముందున్న ముప్పు:**

ఈ అక్రమ ప్లాట్లను కొనుగోలు చేసే ప్రజలు భవిష్యత్తులో భారీ నష్టాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ప్రభుత్వం జోక్యం చేసుకుంటే నిర్మించిన ఇళ్లు అక్రమంగా గుర్తించి కూల్చివేసే పరిస్థితి తలెత్తుతుంది. పార్కులు లేకపోవడం వల్ల పిల్లలకు ఆడుకునే స్థలం లేకుండా పోతుంది. పచ్చదనం తగ్గిపోవడంతో పాటు భవిష్యత్తులో కమ్యూనిటీ అవసరాలకు స్థలం లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

**చర్యలు ఎప్పుడూ...?**

1992 నాటి అసలు లేఅవుట్ ప్లాన్‌ను బయటపెట్టి, పై సర్వే నంబర్లలోని ఓపెన్ స్పేస్‌ను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, నకిలీ పత్రాలు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది

- మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య
- ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత






**వికారాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 17):** రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అందిస్తున్న రంజాన్ తోఫా ను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆమె అందజే శారు. ఈసందర్భంగా చైర్మన్ గడ్డం అనన్య మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నది అన్నారు. పేద ముస్లింలు రంజాన్ పండుగ రోజు కొత్త బట్టలు ధరించి ఆనందంగా ఉండాలనే మంచి ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం బట్టలను ఉచితంగా పంపిణీ చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ద సుధాకర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్లు చిగుళ్లపల్లి రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశం, నాయకులు యాదగిరి, దీపు,హఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు ప్రారంభించిన సర్పంచ్ రోజ రమేష్



**దౌల్తాబాద్, మేజర్ న్యూస్(మార్చి 17):** మండలంలోని చెల్లాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 10 లక్షలతో సీసీ రోడ్డును మంగళవారం సర్పంచ్ రోజా రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి అని తెలిపారు.గ్రామ అభివృద్ధి రోడ్లు మౌలిక సదుపాయాల కోసం దృష్టి పెట్టినట్లు తెలిపారు. గ్రామన్ని అభివృద్ధి పథం లో నడపడానికి ప్రజల అవసరం ఎంతో అవసరం అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పటేల్ విజయ్ కుమార్,ఉప సర్పంచ్ కోలుముల శ్యామప్ప,మాజీ రైతు సమన్వయ జిల్లా మెంబెర్ మల్లేష్,మాజీ సర్పంచ్ శరణయ్య,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రాజప్ప, వార్డ్ సభ్యులు సుంకరి పకిరప్ప,గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవేందర్,మాజీ వార్డ్ సభ్యులు సుంకరి శ్రీనివాస్,సూర్య రీపోటర్ శ్యామ్ సుందర్,శివానోళ్ల భాస్కర్,సి,మహిపాల్,కోలుముల రాజు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ సాగుపై దృష్టి సారించండి...

▶▶ మండల వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్... ▶▶ బూర్గులలో ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ ...




ఫరూఖ్‌నగర్,మేజర్‌న్యూస్(మార్చి17): ప్రకృతి వ్యవసాయ సాగుపై దృష్టి సారించి లాభాలను గడించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్ పథకం క్రింద ఎంపికైన 125మంది గ్రామ రైతులకు కిట్లను అధికారులు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, సహజసిద్ధ ఎరువుల తయారుతో పంటలను సాగుచేయాలనే లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రత్యేక పథకాన్ని తీసుకువచ్చిందని, ఎన్‌ఎంఎన్‌ఎఫ్ పథకం ద్వారా ప్రకృతి ఎరువుల తయారు విధానాలను ప్రతి రైతుకు అవగాహణ కల్పించేందుకు కృషి చేస్తుందని, ప్రతి గ్రామంలో రైతులందరికి కిట్లను అందించి ప్రకృతి వ్యవసాయ సాగును విస్తరించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రసాయన ఎరువుల వల్ల మానవ జీవనంపై అనారోగ్య ప్రభావాన్ని చూపుతున్నాయని, జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం తదితర వాటితో ప్రకృతి ఎరువులను తయారు చేసి ఆహార పదార్థాల పంటలను సాగు చేసి ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే ముఖ్య ఉద్ధేశ్యంతో ముందుకు సాగుతుందని, భవిష్యత్తులో ప్రోత్సహకంగా నగదును సైతం అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, పర్యావరణానికి మేలు జరుగుతుందని తె లిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు సాంకేతిక మెళకువలు ప్రభుత్వ రాయితీలపై అవగాహణ కల్పించారు. పెట్టుబడి లేని వ్యవసాయానికి అవసరమైన ద్రావణాల తయారీకి ఈ కట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాంబాబు, తేజ్‌కుమార్, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




# మహేశ్వరంలోనే సబ్ రిజిస్టర్ కార్యాలయం కొనసాగించాలి : మునగాపాటి నవీన్



మహేశ్వరం,మేజర్‌న్యూస్(మార్చి17): మహేశ్వర ం మండల కేంద్రంలోనే సబ్ రిజిస్టర్ కార్యాలయాని కొనసాగించాలని ఇతర ప్రాంతాలకు తరలించాలని ఊహగాహనాలపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని మహేశ్వరం సర్పంచ్ మునగాపాటి నవీన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాయలం కలెక్టర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం మహేశ్వరంలోనే కొనసాగించాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. మహేశ్వరం శంషాబాద ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయాలను కలిపి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయం గా ఏర్పాటు చేసి జిహెచ్ఎంసి పరిధిలోని మంకల్ రెవెన్యూ ప్రాంతంలో నిర్వహించనున్నట్లు పత్రికలో వార్తలు వస్తుండడంతో మహేశ్వరం మండల ప్రజలు దీనికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

మహేశ్వరం గ్రామం 1995 సంవత్సరం నుంచి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి కేంద్రంగా కొనసాగుతూ నియోజకవర్గం ప్రజలకు రిజిస్ట్రేషన్స్ సేవలను సులభతరం చేస్తుంది ఈ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి కూడా అధిక మొత్తంలో ఆదాయం సమకూర్తోంది ఇటీవల మహేశ్వరం ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతూ ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగి రిజిస్ట్రేషన్ సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది మహేశ్వరం ప్రాంతం కందుకూరు కడ్తాల్ అమన్‌గల్ ప్రాంతాలకు మధ్య సంస్థగా ఉండడంతో ఆ ప్రాంతాల ప్రజలు కూడా ఇక్కడే సులభంగా రిజిస్ట్రేషన్‌ను నిర్వహించుకుంటున్నారు.ఈ కార్యాలయాన్ని జిహెచ్ఎంసి పరిధిలోకి తరలిస్తే ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు సమయం,ఇతర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు . ఈ నేపథ్యంలో మహేశ్వరం మండల ప్రజలు తమ వినతిని రిజిస్ట్రేషన్, స్టాంపు శాఖ అధికారులకు తెలియజేశారు .అధికారులు మహేశ్వరం మండల కేంద్రంలోని సిరిపురం గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 71 లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు అదేవిధంగా ఆర్డీవో కూడా ఆ ప్రదేశాన్ని సందర్శించి సర్వే నిర్వహించినట్లు తెలిసింది . ఈ కార్యక్ర మంలో దేవుల నాయక్ ,లింగం ముదిరాజ్ ,పద్మ కృష్ణ

కృష్ణవేణి శ్రీనివాస్, శివారెడ్డి ,లక్ష్మమ్మ,మంజుల చక్రనాయక్ ,మోతిలాల్ సుజాత ,మల్లమ్మ ,జయమ్మ కృష్ణ ,జగదీష్,జ్యోతి కుమార్ నాయక్, శంకరయ్యనాయకులు కర్రోల్ల చంద్రయ్య ముదిరాజ్, పోతర్ల అంబయ్య యాదవ్ , పాండు యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి ,చంద్రశేఖర్ రెడ్డి , మహేశ్వరం ఉపసర్పంచ్ జోరల రమేష్ రావీణ, ఆజాం హనుమంతు నాయక్, దుడ్డు కృష్ణ, కటికల మహేందర్, జెల్ల రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం.. ఆరోగ్యం

మంచాల, మేజర్ న్యూస్ (మార్చి 17) : ప్రకృతి వ్యవసాయం చేస్తే సమాజానికి ఆరోగ్యాన్ని పంచడంతో పాటు రైతులకు తగిన ఆదాయం లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి ఉష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో డిఏవో ఉష పాల్గొని మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో మెలుకువలు, సాగు పద్దతి గురించి వివరించారు. పంటల్లో విచక్షణ రహితంగా రసాయన ఎరువులు వాడకంతో మట్టి సహజత్వాన్ని కోల్పోంతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పంట మార్పిడీ చేస్తూ సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. అనంతరం చిత్తాపూర్ గ్రామానికి చెందిన రైతులకు రైతు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత డాక్టర్ శ్రీకృష్ణ, మంచాల సర్పంచ్ ఏర్పుల మానస వినయ్, చిత్తాపూర్ సర్పంచ్ అలివేలు రాంచంద్రా రెడ్డి, పీడీ మదన్ మోహన్, ఎడీఏ శోభ, సుజాత, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, పిఏసిఎస్ మాజీ డైరెక్టర్‌లు జెనిగే వెంకటేష్, రాంరెడ్డి , ఏఈవోలు సాయి సిరి, లింగస్వామి, సాయి వాణి, శ్రావణ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.




# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

– మున్సిపల్ వైస్ చైర్మెన్ కాసుల రాముగౌడ్



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి17): మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మెన్ కాసుల రాముగౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో అండర్ డ్రైనేజ్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వార్డు అభివృద్ధితో పాటు మున్సిపల్ అభివృద్ధికి నా సహకారం ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారిగా పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రాజిరెడ్డి, వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

# ఈనెల 22,23న గురుమందిర వార్షిక పూజ



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి17): చేవెళ్ల మండలంలోని గొల్లగూడ గ్రామంలో ఈనెల 22,23న జరిగే సాందీప అచల రుషి పరిపూర్ణ గురుమందిర 52వ వార్షిక పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని వ్యవస్థాపకులు దయానంద నాగుల వెంకటేశం మంగళవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జీ పామెన భీంభరత్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో గొల్లగూడ సర్పంచ్ చెవుల నిర్మలనర్సింలు, నిర్వాహకులు నాగుల శంకరగురుప్రసాద్, ఉపసర్పంచ్ ఈ.రాజేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# చెన్నారంలో ముస్లీం, మైనార్టీలకు ఇఫ్తార్ విందు



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (మార్చి 17): రంజాన్ మాస ఉపవాస దీక్షలను పురస్కరించుకొని తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో సోమవారం గ్రామసర్పంచ్, నాయకుల ఆధ్వర్యంలో ముస్లీం, మైనార్టీలకు ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మజీద్ –ఇ– రహత్ వద్ద ఉపవాస దీక్షల అనంతరం గ్రామ సర్పంచ్ రజితరాజునాయక్, నాయకులు కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, మంద ప్రవీణ్ (సురేష్) శంకర్‌నాయక్, డి. నర్సింహ్మ, డి. శ్రీశైలం , యువత పెద్ద సంఖ్యలో ముస్లీం మైనార్టీలకు శుభాకాంక్షలు తెలిపి ఇఫ్తార విందును ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటుచేసిన సర్పంచ్, నాయకులను ముస్లీం, మైనార్టీలు శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్, నాయకులు మాట్లాడుతూ ఆత్మనిగ్రహం, దాతృత్వం, భక్తికి ప్రతీక అయిన రంజాన్ పండుగను కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లీం, మైనార్టీలు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న ఫోన్ సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా తిరిగి అప్పగింత




**బషీరాబాద్,మేజర్ న్యూస్(మార్చ్ 17):** బషీరాబాద్ మండలం పరిధిలోని రెడ్డి ఘనపూర్ గ్రామానికి చెందిన అంజమ్మ అనే మహిళ ఫోన్ నవంబర్ నెలలో ఆ గ్రామంలో పోగొట్టుకున్న విషయం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోగొట్టుకున్న ఫోన్ సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా వెతికి తిరిగి స్థానిక పోలీస్ స్టేషన్ లో అంజమ్మ కు అప్పగించడం జరిగిందని బషీరాబాద్ ఎస్సై శ్రీశైలం యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మార్చి 25 వరకు యాసంగి రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

- పాస్ పుస్తకం పొందిన కొత్త రైతులకు అవకాశం: వి. మాధవిలత



**కీసర, మేజర్ న్యూస్ (మార్చి 17):** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న యాసంగి రైతు భరోసా పథకం 2025--26కు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 25, 2026ను చివరి తేదీగా నిర్ణయించినట్లు కీసర మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారిణి వి. మాధవిలత ఒక ప్రకటన లో మంగళవారం తెలిపారు. 28 ఫిబ్రవరి 2026 నాటికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు.పథకం ప్రయోజనాలు పొందాలనుకునే రైతులు అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని సమయానికి దరఖాస్తు చేయాలని సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకం (లేదా డిజిటల్ సంతకం కాపీ), ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు సేవింగ్ ఖాతా జిరాక్స్, పూర్తిగా నింపిన దరఖాస్తు ఫారం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా, వ్యవసాయ విస్తరణ అధికారిణి వి. మాధవిలత మాట్లాడుతూ,... యాసంగి రైతు భరోసా పథకం 2025--26 కింద అర్హులైన ప్రతి రైతు తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 28 ఫిబ్రవరి 2026 నాటికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అవసరమైన పత్రాలను పూర్తిగా సిద్ధం చేసుకుని, దరఖాస్తు ఫారాన్ని సరిగా నింపి గడువు లోపు సమర్పించాలన్నారు. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

## తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ నుండి షోకాజ్ నోటీసు జారీ

- డ్రగ్స్ కేసులో జైల్లో ఉన్న రోహిత్
- పార్టీ,అధికార కార్యక్రమాలకు దూరంగా ఉండాలి
- పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల కార్యదర్శి భారత్ కుమార్ వెల్లడి



**తాండూరు,మేజర్ న్యూస్(మార్చి 17):** వికారాబాద్ జిల్లా తాండూరు తాజామాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ నుండి మంగళవారం నాడు ఫోకాజ్ నోటీస్ జారీ చేసింది, బీఆర్ఎస్ పార్టీకి చెందిన క్రమ శిక్షణ వ్యవహారాల ప్రధాన కార్యదర్శి సోమా భారత్ కుమార్ ఈ నోటీస్ లు జారీ చేశారు.రంగారెడ్డి జిల్లా మొహినాబాద్ ప్రాతంలోని తన ఫామ్ హౌస్ లో డ్రగ్స్ దొరకడం, రోహిత్ రెడ్డి తోపాటు పలువురి పై కేసులు నమోదు,రోహిత్ రెడ్డి జైలు కు వెళ్లడం,రచ్చరచ్చ కావడంతో ఆ పార్టీ పెద్దలు రంగంలో దిగి నోటీస్ లు జారీ చేశారు.బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కెసిఆర్ ఆదేశాల మేరకు నోటీస్ జారీ చేయడం జరిగింది అని,ఏడు రోజుల్లో పూర్తి వివరణ ఇవ్వాలి అని అంత వరకు పార్టీ కార్యక్రమాలకు,అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి అని కార్యదర్శి సోమా భారత్ కుమార్ పేర్కొన్నారు.

## మున్సిపల్ అనుమతి లేకుండా
# అన్యమత ప్రచారానికి చర్చి నిర్మాణం

- వికారాబాద్ పట్టణంలో హిందువుల ఇళ్ల మధ్య అక్రమ చర్చి నిర్మాణం
- విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్

**వికారాబాద్,మేజర్ న్యూస్ (మార్చి 17):** వికారాబాద్ జిల్లా హిందువుల మనోభావాలను కించ పరుస్తూ కాలనీలో అన్యమత ప్రచారానికి చర్చి నిర్మాణాన్ని చేపడుతున్నారని బజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ ఆరోపించారు. వికారాబాద్ పట్టణ పరిధిలోని సూర్య ప్రకాష్ కాలనీలో క్రిస్టియన్లు ఎవరూ లేక పోయినా అన్యమత ప్రచారానికి చర్చి నిర్మించడం తగదని ఆయన పేర్కొన్నారు. పోలీస్ కాలనీలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రిస్టియన్ ధ్రువ పత్రాలు కలిగిన వారు ఏ ఒక్కరూ లేకున్నా చర్చి నిర్మాణం ఎలా చేపడతారని ఆయన ప్రశ్నించారు. సూర్య ప్రకాష్ నగర్ కాలనీ కమిటీ అనుమతి కానీ మున్సిపల్ అధికారుల అనుమతి కానీ లేకుండా నిర్మాణం కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు చెప్పే మాటలన్నీ భూటకాలేనని నిరూపించే సంఘటన వికారాబాద్ పట్టణం సూర్య ప్రకాష్ శాటిలైట్ టౌన్షిప్ కాలనిలో చోటు చేసుకుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై భజరంగ్ దళ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ పట్టణం పోలీస్ కాలనీని 2004 సంవత్సరంలో అప్పటి ఎస్పీ సూర్య ప్రకాష్ 45 ఎకరాల భూమిలో పోలీసు అధికారులకు 515 ప్లాట్స్ చేసి సిబ్బందికి కేటాయించారు. ఈ కాలనీలో 2004 సంవత్సరం నుండి ఇప్పటివరకు, ఒక రెండు వందల కుటుంబాలు ఇళ్ళు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని, సూర్య ప్రకాష్ కాలనీ లోని సొసైటీ భూమిలో భవిష్యత్ అవసరాలకు, కొంత ఖాళీ స్థలాన్ని వదిలారు. ఈ స్థలంలో మందిరం, మస్జీద్, చర్చ్ నిర్మాణాలకు ఒక్కో కమ్యూనిటీకి 200 గజాల భూమిని వదిలినట్లు అప్పటి కాలనీ కమిటీ తీర్మానించినట్లు తెలిపారు. గత జూన్ మాసంలో సొసైటీ భూమిలోని 400 గజాల భూమిలో సొసైటీ కార్యాలయం పేరుతో చర్చి నిర్మిస్తున్నారని కాలనీ అధ్యక్షులు గిరివాచారి చెప్పి చర్చి పనులు ప్రారంభించారని, అక్టోబర్ మాసంలో అట్టి నిర్మాణంపై శిలువ ఏర్పాటు చేసి చర్చి నిర్మిస్తున్నామని, కాలనీవాసులు పోలీసు సిబ్బంది ఏఆర్ ఎఎస్ఐ లు సంజీవ, ప్రకాష్, నర్సింహులు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కలసి తామే నిర్మిస్తున్నట్లు చెప్పడం చర్చనీయాంషమైనదని, కాలనీలో సొసైటీ నిబంధనల ప్రకారం అందరూ కలిసి సొసైటీ తీర్మానం చేసి ఏదైనా పనిని ప్రారంభించాలి, కానీ సొసైటీ కార్యాలయం నిర్మిస్తున్నామని అందరి సభ్యులను నమ్మించి సభ్యులకు తెలుపకుండా, తీర్మానం చేయకుండా కాలనీ సభ్యులను మభ్యపెట్టి చర్చి నిర్మాణం చేపట్టిన నలుగురు వ్యక్తులుకు మద్దతు తెలిపిన సొసైటీ అధ్యక్షులు హెడ్ కానిస్టేబుల్ గిరివా చారి, ప్రధాన కార్యదర్శి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులుపై తగు చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, మున్సిపల్ కమిషనర్ ని గతంలో కోరినట్లు తెలిపారు. అక్టోబర్ 4న అక్రమంగా చర్చి నిర్మిస్తున్నారని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సూర్య ప్రకాష్ కాలనీవాసులు ఫిర్యాదు చేయగా, మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసిన నోటీసును నిర్మాణం జరుగుతున్న 6 పీట్ల ఎత్తుకు నిర్మించిన గోడకు అతికించి అక్కడ ఉన్న వ్యక్తులకు అందించారు. అయినా నిర్మాణం పనులు ఆగడం లేదు. నిర్మాణం చేపడుతున్న వ్యక్తులు కూడా క్రిస్టియన్ సామాజిక వర్గానికి చెందినవారు కాదు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారని ఆరోపించారు. ఎస్సి రిజర్వేషన్ ద్వారా ఉద్యోగం పొందిన వ్యక్తులు,



వారి పిల్లలఅందరికీ ఎస్సి కుల ధ్రువ పత్రాలు తీసుకుని ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, ప్రభుత్వ రాయితీలు పొందిన వారు ఉన్నారన్నారు. చర్చిని నిర్మించకుండా అడ్డుపడిన వారి ఇండ్ల పైకి వెళ్లి బెదిరింపులకు పాల్పడం పట్ల హిందూ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న అధికారుల నిర్లక్ష్యం వలన నిర్మాణం జరుగుతుందని, రాత్రి వేళలో 11 నుంచి ఉదయం 5 గంటల వరకు రోజు నిర్మాణం పనులు దొంగ చాటుగాఅక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అన్యమత ప్రార్థనలు చేస్తాం ఏం పీక్కుంటారో పీక్కోమని సంజీవతో పాటు ముగ్గురు సభ్యులు కాలనీ వాసులను బెదిరిస్తూ వికారాబాద్ లోని పాస్టర్లతో కలిసి హంగామా సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజకీయ అండ దండలు మాకు ఉన్నాయంటూ, కాలనీ లోని హిందూ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసి చర్చిని ప్రారంభించాలని ప్రయత్నిస్తున్నారని, ఈ నలుగురు వ్యక్తుల కుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలని, నిజానికి 30% క్రిస్టియన్ జనాభా కాలనిలో ఉంటే చట్ట ప్రకారం వారికీ ఉన్న క్రిస్టియన్ కులము బీసీ "సీ " ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీల సమక్షంలో నిర్ధారణ చేసి ప్రభుత్వం నిబంధనల ప్రకారం మున్సిపల్ అనుమతి పొంది, నిర్మించుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఎస్సి రిజర్వేషన్ పై లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి తిరిగి చెల్లించేవరకు వదలమని , చట్టం అందరికి సమానమనే ప్రభుత్వ అధికారులు అక్రమాలకు పాల్పడితే ఎలా అని ప్రశ్నించారు. సామాన్య ప్రజలకు ఖానూన్ వర్తిస్తుందని, పోలీసులకు చట్టం చుట్టమా అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హిందూ ధార్మిక సంఘాలను ఏకం చేసి ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

**మున్సిపల్ అనుమతి లేకుండా నిర్మాణం వద్దు -కాలనీ అధ్యక్షకార్యదర్శులు గిరివాచారి, శ్రీనివాస్**



2017- 2019 లలో కాలనీ ప్రజల సౌకర్యార్థం మా కాలనీలోని మిగులు భూమిలో ప్రార్థన మందిరాలు నిర్మించుకునేందుకు హైందవులకు 220 గజాలు, ముస్లింలకు 220 గజాలు, క్రైస్తవులకు 220 గజాలు ఇవ్వాలని తీర్మానించామని, గత కొన్ని నెలలుగా కొందరు క్రైస్తవులు వారికి కేటాయించిన 220 గజాల స్థలంలో చర్చి నిర్మించుకోవడం గమనించామని, మునిసిపల్ శాఖ అనుమతితో నిర్మిస్తున్నారని భావించామని, కాలనీ అధ్యకుడు గిరివా చారి, కార్యదర్శి శ్రీనివాస్ లు తెలిపారు. తాజాగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి నోటీసు వచ్చేవరకు ఆ నిర్మాణానికి అనుమతులు లేవని మాకు తెలియలేదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉంటామని . ఆ కట్టడంపై మున్సిపల్ యంత్రాంగం గాని, ప్రభుత్వాధికారులు గానీ ఎటువంటి చర్య తీసుకున్నా వారికి మా కాలనీ కమిటీ నుండి పూర్తిగా సహకరిస్తామని తెలిపారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య







**వికారాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 17):** రంజాన్ మాసం ఉపవాస దీక్షలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణం సాకేత్ నగర్ లోని గౌలికర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య పాల్గొన్నారు.ఈ ఇఫ్తార్ విందులో వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్, ఆర్టిఐ మెంబర్ జాఫర్,ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.ముందుగా మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య ప్రార్ధనలలో పాల్గొని అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూర తినిపించి మంగళవారం ఉపవాస దీక్షను విరమింపచేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫాను లబ్ధిదారులకు అందజేసి, రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు.

# వినియోగదారుల హక్కు చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

▶▶ నందిగామలో వినియోగదారుల హక్కుచట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు ▶▶ ముఖ్య అతిథిగా హాజరై చట్టం గురించి వివరించిన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి





నందిగామ, మేజర్‌న్యూస్ (మార్చి 17): వినియోగదారుల హక్కు చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి సూచించారు. ప్రపంచంలో మనమందరం వినియోగదారులమేనని, మన హక్కులను చట్టాలను పూర్తిగా తెలుసుకుని, మనల్ని మనమే మోసపూరిత వ్యక్తుల నుండి రక్షించుకోవాలని ఆమె కోరారు.నందిగామ మండల కేంద్రంలో మంగళవారం స్థానిక గ్రామపంచాయతి కార్యాలయంలో వినియోగదారుల హక్కు చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. మార్చి 15వ తేదీ వినియోగదారుల హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ స్వాతి రెడ్డి ఆదేశాల మేరకు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేణుగోపాలరావు, సిఐ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి ముఖ్య అతిథిగా హాజరై వినియోగదారుల చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనందరం వినియోగదారులమే, వస్తువులు కొనేటప్పుడు జాగ్రత్త వహించాలని, నాణ్యమైన వస్తువుల్ని కొనాలని, కొన్న ప్రతి వస్తువుకు విధిగా రసీదులు పొందాలని సూచించారు. గడువు ముగిసిన వస్తువులను కొని మోసాల బారిన పడరాదని, నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాలకు బలి కావద్దని, అనవసరమైన వెబ్‌సైట్లను ఓపెన్ చేయవద్దని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోరారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, న్యాయ సహాయం, సలహాల కొరకు జిల్లాస్థాయి మొదలు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో వినియోగదారుల ఫోరంలు ఉన్నాయని తెలిపారు. వాటి ద్వారా మనం నష్టపరిహారాన్ని పొందవచ్చని, మోసపోయినప్పుడు నష్టపరిహారం పొందడం కూడా మన హక్కేనని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ సిఐ ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నర్వ వేణుగోపాల్ రావు, న్యాయవాదులు నరేంద్రనాథ్, జయమ్మ, అంతారం నర్సింహులు, శ్రీనివాసమూర్తి, రూప్‌సింగ్, బొమ్మగళ్ల రమేష్, వార్డు సభ్యులు నర్సింహులు, చించేటి శివ, కొనుముల కిట్టు, నందిగామ పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# హామీలను వెంటనే అమలు చేయాలి : టీ యాధిష్




### తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసక చేసట్టిన బీజేపీ

మహేశ్వరం,మేజర్‌న్యూస్(మార్చి17): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వే ంటనే అమలు చేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు టి యాధిష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాయలం తహశీల్దార్‌కు హీమిలను వేంటనే అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు దాటిన ఇచ్చిన హామిలలో ఏ ఒక్క హామీ అమలు చేయాలేదని తెలిపారు. యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా. భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇప్పటికీ అమలు కావడం లేదని, ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారని , ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. వృద్ధాప్య, వితంతు దివ్యాంగులకు ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్లు అర్హులైన లబ్ధిదారులకు అందడంలేదు. మండలంలో దరఖాస్తులు చేసుకున్న అనేక మంది వృద్ధులు, వికలాంగులు ఒంటరి మహిళలకు ఇప్పటికీ పెన్షన్లు మంజూరు చేయాలేదని, అర్హులైన అభ్యర్థులందరి దరఖాస్తులను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు అందించాలని కోరారు.పేదలకు ప్రభుత్వం ప్రకటించిన గృహ నిర్మాణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు..కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు దరఖాస్తులు సమర్పించినప్పటికీ వారి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. ఆ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నాము. పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు వీధి దీపాలు వంటి ప్రాథమిక సదుపాయాలు సరైన విధంగా అందడం లేదని అన్నారు. నివాస, ఆదాయ కుల ధృవీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అనేక ప్రభుత్వ పథకాలకు ఈ పత్రాలే ప్రామాణికం కావడంతో నిర్ణీత సమయంలో ధృవీకరణ పత్రాలను జారీ చేసి అర్హులు నష్టపోకుండా చూడాలి.సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి మండల పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్,జిల్లా కార్యదర్శి అయిళ్ల యాదయ్యగౌడ్ ,దేశ్యానాయక్,మండల ప్రధాన కార్యద ర్శులు వనంపల్లి శ్రావణ్,బి ఉపేందర్,మోర్చాల అధ్యక్షులు ఎర్ర పాండు ,మాధవ్,రఘువీర్,భారత్,ఎం దేవేందర్,శివ,సాయినాథ్,ప్రకాశ్,యాదయ్య,కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు

▶▶ మండల వ్యవసాయ అధికారి లావణ్య ▶▶ రైతులకు కిట్లను పంపిణీ



కందుకూరు,మేజర్‌న్యూస్(మార్చి 17): ప్రకృత వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కవ లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు.ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్(ఎన్ఎంఎన్ఎఫ్)లో భాగంగా మంగళవారం కందుకూరు రైతు వేదికలో రైతులకు కిట్లు అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని దీనితో పాటు పర్యావరణాన్ని రక్షించుకోవ చ్చని పేర్కొన్నారు. రైతులకు అందించిన కిట్లలో జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం, తయారికి అవసరమైన పదార్థాలు,సూచనలు ఉంటాయన్నారు.రైతులు ఈకిట్లను సమర్ధవంతంగా వినియోగించుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరణలో పెట్టాలని సూచించారు.125 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ, సాంకేతిక సూచనలు,ప్రభుత్వ సహాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తగూడ సర్పంచ్ బొక్క సువర్ణ అంజిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎల్.రాజు,రాఘువేంద్రచారి, రైతులు పాల్గొన్నారు.

## పంచపరివర్తనతో అన్ని వర్గాల్లో ఐక్యత



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి17): కుల వివక్షను తొలగించి సమాజంలోని అన్ని వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని దేవునిఎర్రవల్లి వార్డులో పంచపరివర్తన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వార్డులోని హరిజన శివయ్య ఇంట్లో బీజేపీ కార్యకర్తలు ఈశ్వర్, పత్తి సత్యనారాయణ, రామకృష్ణ, సామ కృష్ణారెడ్డి, కరికె మాణిక్యంలు భోజనం చేశారు. కులవర్గ బేధాలను తొలగించి సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు పంచ పరివర్తన్‌లో ఐదు రకాల పరివర్తన్‌లను చేపట్టడం జరిగిందని, సామాజిక సమరసత, కుటుంబ వ్యవస్థ బలోపేతం, పర్యవరణపరిరక్షణ, స్వదేశీ వాడకం, పౌర విధుల వంటి ప్రధాన అంశాలపై దృష్టి పెడుతుందన్నారు. ప్రజలంతా భాగస్వాములు కావాలనే ఉద్దేశ్యంతో పంచపరివర్తన్ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

## నేడు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల వేలం




చేవెళ్ల, మేజర్ న్యూస్ (మార్చి17): ప్రొహిబిషన్ ఎక్సైజ్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేడు చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఎక్సైజ్ ఎస్సై మొయినుద్దీన్ ఖాజా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో స్వాదీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 10:30గంటలకు ఎక్సైజ్ కార్యాలయంలో జరిగే వేలం పాటలో పాల్గొని వాహనాలను స్వాదీనం చేసుకోవాలని సూచించారు.

## ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షునిగా ఎన్.గోవర్ధన్‌రెడ్డి



చేవెళ్ల, మేజర్‌న్యూస్(మార్చి17): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షునిగా ఎన్. గోవర్ధన్ రెడ్డిని నియ మించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఉద్యమ కారులకు న్యాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని కాలయాపన చేస్తుందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం, పింఛన్, గుర్తింపు కార్డు హామీలను నెరవేర్చాలన్నారు. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉద్యమకారులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర చైర్మెన్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి రంగా రెడ్డి చైర్మెన్ యాలాల మహేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.

## మత్స్య పారిశ్రామిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



మంచాల, మేజర్ న్యూస్ (మార్చి 17) : మండలంలోని ఖాగజ్‌ఘట్ గ్రామంలో మంగళవారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల అధికారి శాలిని అద్యక్షతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అద్యక్షులుగా పసుల రవి, ఉపాద్యక్షులుగా యాట సుధాకర్, కార్యదర్శిగా పూజారి నవీన్, డైరెక్టర్‌లుగా నరేష్, పసుల జంగయ్య, పూజారి కృష్ణ, యార శేఖర్, యాట శివ, యార ప్రవీణ్, మరో 32 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. మత్స్యకారుల జీవనోపాదిని మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందరికి వర్తించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొద్రమోని నరసింహ, నాయకులు యాట జంగయ్య, యార రాజు తదితరులు ఉన్నారు.

# ఎల్లంపేట మున్సిపాలిటీలో అనుమతుల్లేని వెంచర్‌ల కలకలం

▸▸ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, అనుమతుల్లేక విక్రయాలు ? అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**మేడ్చల్, మేజర్ న్యూస్ (మార్చి, 17)**: ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో అనుమతుల్లేని వెంచర్‌లు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నూతనకల్ గ్రామంలో అక్రమంగా వెంచర్‌ల ఏర్పాటు జరుగుతుండగా, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఎగ్గొడుతున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం వ్యవసాయ భూములను ఫామ్‌ల్యాండ్స్ పేరుతో మార్పిడి చేసి అనుమతులు లేకుండానే విక్రయాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీటిని కొనుగోలు చేసిన ప్రజలు రిజిస్ట్రేషన్, ఇంటి నంబర్లు, నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణాల విషయంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామంలోని సర్వే నంబర్లు 593, 594, 598, 597, 586తో పాటు ప్రభుత్వ భూమిగా ఉన్న 711 సర్వే నంబర్‌లో కూడా అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఎలాంటి నాలా కన్వర్షన్, హెచ్‌ఎండీఏ లేదా మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు.



వార్డ్ ఆఫీసర్ ఉమా దేవి

వెంచర్‌లలో పార్కులు, క్రీడా ప్రాంగణాలు, కమ్యూనిటీ హాల్, డ్రైనేజీ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకుండానే ప్లాట్లను విక్రయించడం వల్ల కొనుగోలుదారులు నష్టపోతున్నారని విమర్శించారు.



ఎల్లంపేట మున్సిపాలిటీ నూతనకల్ గ్రామంలో అనుమతుల్లేక నిర్మిస్తున్న వెంచర్ దృశ్యం

నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన అనుమతులు లేకుండా ఇరుకైన రోడ్లతో వెంచర్‌లు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు, ఫీజులను ఎగ్గొడుతున్నారని ఆరోపించారు.

అక్రమ వెంచర్‌లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కొందరు అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు సహకరిస్తున్నారని స్థానికులు విమర్శించారు. అలాగే వార్డ్ ఆఫీసర్ ఉమాదేవిపై కూడా స్థానికులు ఆరోపణలు చేస్తూ పలుమార్లుఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమ వెంచర్‌లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మైనారిటీల అభ్యున్నతి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

▸▸ సర్పంచ్ కరణం దత్తాత్రేయ రావు




**కొడంగల్, మేజర్ న్యూస్ (మార్చి 17 )**: మైనారిటీల అభ్యున్నతి, సంక్షేమం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని చిన్ననందిగామ సర్పంచ్ కరణం దత్తాత్రేయ రావు అన్నారు. కొడంగల్ మండల పరిధిలోని చిన్ననందిగామ గ్రామంలో ముస్లింలకు రంజాన్ తోఫా కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీలు సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన అభివృద్ధి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. మైనారిటీల ఆర్థిక అభ్యున్నతి కోసం రుణాలు, సబ్సిడీలు, విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, మెరిట్ కమ్-మీన్స్ ఉపకార వేతనాలు అందిస్తుందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్లిం సోదరులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏసమ్మ, వార్డు సభ్యులు అబ్దులప్ప, కిష్టప్ప, కాంగ్రెస్ నాయకులు చంద్రప్ప, ముస్లిం సోదరులు పీర్ అహ్మద్, మొహ్మద్ మక్బూల్, షబ్బీర్, అంజద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల కోసం ఆశాల పోరాటం ఉధృతం

▸▸ మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత– సీఐటీయూ నేతల అరెస్టులు

▸▸ ఆశాల సమస్యలు పరిష్కరిస్తాం – అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (మార్చి 17)**: మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్ల 48 గంటల నిరసన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన కార్యక్రమంలో మంగళవారం పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. తోపులాటలు, పిడి గుద్దులు చోటుచేసుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం పలువురు ఆశా వర్కర్లతో పాటు సీఐటీయూ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఆశా వర్కర్లు తమ డిమాండ్లను కలెక్టరేట్‌కు వినిపించేందుకు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో తోపులాటలు చోటుచేసుకున్నాయి. పలువురిని అరెస్టు చేసి బొల్లారం, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు సమాచారం. ఈ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. గత 20 సంవత్సరాలుగా ఫిక్స్ వేతనం రూ.18,000 కోసం పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనాలు, ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని, అలాగే మట్టీ ఖర్చుల కోసం రూ.50,000 ఇవ్వాలని రాష్ట్ర అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్ మాట్లాడుతూ, ఆశా వర్కర్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి శ్రమను దోపిడీ చేస్తున్నదని ఆరోపించారు. ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, ఇలాంటి చర్యలతో ఉద్యమాలను అణచివేయలేరని హెచ్చరించారు.

పోలీసుల నిర్బంధాలను లెక్కచేయకుండా 48 గంటల నిరసనల్లో పాల్గొన్న ఆశా




వర్కర్లు తమ సమస్యలను కలెక్టరేట్‌కు వినిపించాలనగా అరెస్టులు చేశారని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**అదనపు కలెక్టర్ హామీ– సమస్యల పరిష్కారానికి చర్యలు:**

ఇదిలా ఉండగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆశా వర్కర్ల సమస్యలను పరిశీలించి పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, జిల్లా పరిధిలో పరిష్కారం కాని అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసి ప్రత్యేక చొరవతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో చర్చించి, నియమ నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆశా వర్కర్లు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అధికారుల సానుకూల స్పందనతో ఆశా వర్కర్లు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి, అధ్యక్షురాలు అనిత, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐ. రాజశేఖర్, బి. లింగస్వామి, పి. గణేష్, ఆర్. సంతోష్, ఎం. నరేష్, శంకరమ్మ, రమ, సబియా, పద్మ, వసంత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 31 వరకు ప్రతి ఒక్కరు ఇంటి ట్యాక్స్‌లు చెల్లించాలి

▸▸ గ్రామ అభివృద్ధికి సహకరించాలి

▸▸ పెద్దేముల్ పంచాయతి కార్యదర్శి లాలప్ప



**పెద్దేముల్ , మేజర్‌న్యూస్(మార్చి – 17)**: ఈ నెల 31 వరకు ప్రతి ఒక్కరు ఇంటి ట్యాక్స్‌లు సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని పెద్దేముల్ గ్రామ పంచాయతి కార్యదర్శి లాలప్ప అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే , దానికి పుణాధి ఇంటి ట్యాక్స్‌లు ముఖ్యం అన్నారు. జనవరి మాసం నుండి ఇంటి ట్యాక్స్‌ల కోసం పంచాయతి సిబ్బంది ఇంటింట తిరుగడం జరుగుతుందని తెలియచేశారు. ఏది ఏ మై మార్చి 31వ వరకు ప్రతి ఒక్కరు ఇంటి ట్యాక్స్‌లు చెల్లించాలని కోరారు. పెద్దేముల్ గ్రామ పంచాయతీల్లో మొత్తం 1300 ఇండ్లు , దుకాణాలు ఉన్నాయని , సంవత్సరానికి ఇంటి ట్యాక్స్‌లు రూ.6లక్షల 12వేల 310 రుపాయలు రావలసి ఉండగా , ప్రస్తుతం 50శాతం మాత్రం ఇంటి ట్యాక్స్‌లు రావడం జరిగిందన్నారు. ఇంటి ట్యాక్స్‌ల ద్వారనే గ్రామం అభివృద్ధితో పాటు, పారిశుధ్య కార్మీకులకు జీతాలు, చెత్త ట్రాక్టర్‌కు డిజిల్‌తో పాటు ఇతర కార్యక్రమాలను ప్రతి నెల సుమారు రూ.లక్షకు పైగా నిధులు ఖర్చు అవుతున్నాయని తెలియచేశారు. గత ఏడాది సుమారు రూ.3లక్షల వరకు బకాయిలు ఉన్నాయని, వాటిని కూడ త్వరల్లో చెల్లించాలన్నారు. ఇంటి ట్యాక్సులు సకాలంలో చెల్లించని ఎడల అట్టి యజమానులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు కూడ జారీ చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు గమనించి గ్రామ అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం పంచాయతి కారోబార్‌తో పాటు సిబ్బంది ట్యాక్స్‌ల కోసం ఇంటింట తిరుగడం జరుగుతుందని, ఆలా కాకుండా ప్రతి ఒక్కరు గ్రామ పంచాయతి కార్యాలయంకు వచ్చి ఇంటి ట్యాక్స్‌లు కట్టెల చుడాలని,పంచాయతి అధికారులకు సహకరించాలని కోరారు.

# పుట్టిన బిడ్డ భవిష్యత్‌లో అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండాలి

▸▸ గర్భిణీలు, బాలింతలకు, కిషోర బాలికలపై శ్రద్ధ చుపాలి

▸▸ సీడీపీఓ కాంతరావు

**పెద్దేముల్ , మేజర్‌న్యూస్(మార్చి – 17)**: పుట్టిన బిడ్డ భవిష్యత్తులో అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండాలని ... గర్భిణీలు, బాలింతలకు, కిషోర బాలికలపై శ్రద్ధ వహించాలని సీడీపీఓ కాంతరావు అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలంలోని తింసాన్‌పల్లి, నాగులపల్లి, గోపాల్‌పూర్, పెద్దేముల్ గ్రామాలల్లో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు.గర్భిణీలకు, బాలింతలకు, కిషోర బాలికలకు,ఆరోగ్యం పైన, పౌష్టిక ఆహారం పైన , అంగన్‌వాడీ సేవల పైన వివరించారు.ప్రభుత్వం పంపిణి చేస్తున్న వస్తువులు గర్భిణీలకు సక్రమంగా అందేల చుడాలన్నారు.అంతేగాకుండా అంగన్‌వాడీ సేవలపై వివరించారు.పుట్టిన బిడ్డ భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉండాలంటే బిడ్డ పుట్టినప్పటి నుండే మంచి పోషణ, వ్యాధి నిరోదక టీకాలు కచ్చితంగా



అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు తప్పకుండా సమయపాలన పాటించాలని, ప్రతి నిత్యం మెను ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. అనుమతులు లేకుండా సెంటర్‌లకు డుమ్మాలు కొడితే వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. వారితో పాటు పెద్దేముల్ మండల ఆంగన్‌వాడీ సుప్రవైజర్ సునితత్తో పాటు ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్‌లు తదితరులు పాల్గోన్నారు.

# జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు అఖిలేష్ ఎంపిక

▸▸ విజేత టెక్నో స్కూల్ విద్యార్థికి ప్రశంసలు

**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (మార్చి 17)**: మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీ తుర్కపల్లి పరిధిలోని విజేత టెక్నో స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి అఖిలేష్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రాంరెడ్డి తెలిపారు. ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన



పోటీల్లో అతను ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఈ అవకాశాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మే 12 నుంచి 15వ తేదీ వరకు హన్మకొండ రైల్వే గ్రౌండ్స్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో అఖిలేష్ పాల్గొంటాడని తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అఖిలేష్ సాధించిన ఈ విజయంపై పాఠశాల పి.ఈ.టి ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.





## రైతులు తమ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలి

### వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య

వికారాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 17): రైతులు తమ పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పశు వైద్య, సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమం, ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులోని గేదెలకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఏరియా ఆసుపత్రి పశు వైద్య సహాయ సంచాలకులు కె.పూర్ణ చందర్ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...., పశు సంపదను పెంచుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. పశువులకు సోకే వ్యాధులను ముందే గుర్తించడం వల్ల పశువుల యాజమానులకు నష్టం రాకుండా చూడవచ్చున్నారు. ముఖ్యంగా గాలి కుంటు నివారణ టీకాలు తీయించుకోవాలని తెలిపారు. ఈ టీకాలు చూడి పశువులకు కూడా సురక్షితమన్నారు. ఈ వ్యాధి పశువులకు సోకితే తీవ్రమైన జ్వరం, పాడి పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. 3 నెలలు పై బడిన అన్ని గో జాతి, గేదె జాతి పశువులకు టీకాలు తీయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు వినోద్ కుమార్, రామకృష్ణారెడ్డి, ఎడి డాక్టర్ విజయలక్ష్మి, సిబ్బంది హాజీ, మహేష్ పాల్గొన్నారు.



# క్రీడలే యువత భవిష్యత్తుకు బంగారు బాట : చామకూర మల్లారెడ్డి

### సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు.. ఫీర్జాదిగూడ జట్టు విజయం





ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (మార్చి 17) : క్రీడల ద్వారా యువతకు ఉన్నత అవకాశాలు లభిస్తాయని, క్రమశిక్షణతో సాధన కొనసాగిస్తేనే విజయాలు సాధ్యమని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. పోచారం డివిజన్ పరిధిలోని వెంకటాద్రి టౌన్‌షిప్ సెంట్రల్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆయన 50వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. బీఆర్ఎస్ యువ నాయకుడు, ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఫీర్జాదిగూడ జట్టు ఘట్‌కేసర్ జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ క్రీడలలో ప్రతిభ కనబరిస్తే ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని, ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని అలవరచుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు. క్రీడాకారులకు తగిన మౌలిక వసతులు కల్పిస్తేనే వారు మరింతగా రాణించగలరని అన్నారు. అనంతరం విజేతలైన ఫీర్జాదిగూడ జట్టుకు జ్ఞాపికతో పాటు రూ.1,11,111 నగదు బహుమతి, రన్నరప్ ఘట్‌కేసర్ జట్టుకు జ్ఞాపికతో పాటు రూ.55,555 నగదు సామల సందీప్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వైఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు సామల యాది రెడ్డి, మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్లు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, వంగూరి శివశంకర్, కొంతం వెంకట్రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మెట్టు బాల్‌రెడ్డి, సింగిరెడ్డి సాయిరెడ్డి, బండారి అంజనేయులు గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, నాయకులు రేసు లక్ష్మారెడ్డి, కోళ్ల యాదగిరి, యరుకల దుర్గారాజ్ గౌడ్, సుర్వి శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- కోలుకుంద సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ
- రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఇచ్చిన సర్పంచ్
- మహిళలకు చీరలు,యువతులకు డ్రెస్సులు పంపిణీ



వికారాబాద్,మేజర్ న్యూస్ (మార్చి 17):మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని కోలుకుంద సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్ల సంఘం ప్రధాన కార్యదర్శి, కరణం కీర్తి రామకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి మోమిన్ పేట్ మండలం కోలుకుంద గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.అదే విధంగా మహిళలకు చీరలు, యువతులకు డ్రెస్సులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ భరత్ భూషణ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ భరత్ భూషణ్ ను సర్పంచ్ సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ మాట్లాడుతూ....గ్రామంలో ప్రజలు పండుగలను కలిసి మెలసి జరుపుకోవాలని తెలిపారు.గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం ఎస్ఐ భరత్ భూషణ్ మాట్లాడుతూ.... శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా అభివృద్ధి విషయంలో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు శేఖర్, బిచ్చప్ప, కాశీం, నాగమణి, రాజమణి, వినోద, స్వరూప, గ్రామ పెద్దలు కరణం భుజంగం, కుద్బుద్దిన్, సంగమేశ్వర్, బ్రహ్మానందరెడ్డి, అబ్దుల్, గొల్ల శ్రీనివాస్, గఫర్, రషీద్, జహంగీర్, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌కు చేరువలో అంతర్జాతీయ యూనివర్సిటీ

- సింబియాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో బీటెక్ కోర్సు
- తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య – ఉజ్వల భవిష్యత్
- సిట్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాల ద్వారా ప్రవేశాలు
- **2026** సిట్ ఎంట్రెన్స్ పరీక్షకు అప్లికేషన్‌లు ప్రారంభం



సింబియాసిస్ ఇంటర్నేషనల్ డీమ్డ్ యూనివర్సిటీ

షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (మార్చి 17):తల్లి తండ్రులు తమ పిల్లలను మంచిగా చదివించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తపన పడుతుంటారు. ఇదే క్రమంలో పిల్లలకు మంచి విద్య అందిచేదిశగా ప్రయత్నాలు చేస్తుంటారు. మరి ఆ దిశగా చేస్తున్న ప్రయత్నాలలో పిల్లలను ఎక్కడ చదివించాలి? ఏ కళాశాలలో చదివిస్తే నాణ్యమైన విద్య, మెరుగైన ఉద్యోగ అవకాశాలు లబిస్తాయి ? అనే సందిగ్ధంలో పడుతుంటారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యను ఎంచుకునే విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలను చదివించే వేదికను ఎంచుకోవడంతో తలమునకలవుతూ ఉంటారు.

జేఈఈ, ఎంసెట్ పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులు వారి వారి ర్యాంకుల ఆధారంగా ఇంజనీరింగ్ కళాశాలలో ఆయా కోర్సులలో అడ్మిషన్లు పొందుతున్నారు. మెరుగైన ర్యాంకులు సాదించని వారు అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచి, విద్యార్థులకు అన్ని రకాల వసతులను కల్పిస్తున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల కోసం వెతుకుతూ రాష్ట్రాన్ని వదిలి సుదూర ప్రాంతాలకు పిల్లలను పంపే ఆలోచన చేస్తున్నారు.

షాద్‌నగర్‌కు చేరువలోనే ...

1971లో ప్రారంభమైన సింబయాసిస్ యూనివర్సిటీ దేశ, విదేశాల్లో విస్తరించి నోయిడా, బెంగళూరు, దుబాయ్, మహారాష్ట్ర, పూణే , నాసిక్, నాగ పూర్, హైదరాబాద్ ఇలా మొత్తంగా 43 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకుంది. ఆయా సింబియాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీల్లో 80 దేశాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. అదదే తరహాలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో నందిగామ మండలంలోని మొదల్లగూడ గ్రామంలో సింబియాసిస్ ఇంటర్నేషనల్ డీమ్డ్ యూనివర్సిటీ ఏర్పాటై సుమారు 18 సంవత్సరాలు కావస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలు ఉన్న ఈ యూనివర్సిటీలో పలు దేశాల విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఈ యూనివర్సిటీ ప్రారంభమైనప్పటి నుండి ఇందులో ఇంజనీరింగ్ కోర్సు ఉండేది కాదు. 2024 లోనే సింబియాసిస్ యాజమాన్యం హైదరాబాద్ బ్రాంచ్‌లో ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ( ఇంజనీరింగ్) కోర్సును ప్రారంభించింది. అంతేకాదు ఎప్పుడు లేని విధంగా స్థానికులు, చుట్టుపక్కల వారికి అవకాశం కల్పించేందుకు డే స్కాలర్స్‌కు అనుమతించింది.

సింబియాసిస్‌లో ప్రవేశం ఇలా..

సింబియాసిస్ ఇంటర్నేషనల్ డీమ్డ్ యూనివర్శిటీ లో చేరాలంటే యూనివ ర్సిటీ వారు నిర్వహించే సిట్ ఎంట్రెన్స్ పరీక్షలో మంచి ర్యాంకు సాదించాల్సిందే. సింబయోసిస్ యూనివర్సిటీకి సంబంధించి ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాసిన విద్యార్థులకు ఆయా క్యాంపస్‌ల నిర్వాహకులు మెరిట్ లిస్ట్ ప్రకారం అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుంది. సింబియాసిస్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఎలాంటి డొనేషన్లు, అడ్మిషన్ ఫీజులు ఉండవనే విషయం విద్యార్థుల తల్లితండ్రులు గుర్తించాలి. ప్రస్తుతం నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ ఐఆర్ఎఫ్) లో 24 స్థానంలో నిలిచిన సింబియాసిస్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ ర్యాంకులో 46 స్థానంలో నిలిచింది. న్యాక్ ఏప్లస్‌ప్లస్ అక్రిడేటెడ్ కలిగి క్యాటగిరి వన్‌లో నిలిచిన యూనివర్సిటీ క్యూఎస్ వరల్ట్ ర్యాంకింగ్‌లో గ్లోబల్ గుర్తింపు పొందిఉంది.

సిట్ ఎంట్రె న్స్‌కు ప్రారంభమైన అప్లికేషన్‌లు..

సింబియాసిస్ ఇంటర్నేషనల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్య కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ అప్లికేషన్ కు సంబంధించి దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. మే 2, మే 10 తేదీలలో రెండు విడతలుగా నిర్వహించే ఈ ఎంట్రె న్స్ పరీక్షలకు గాను ఏప్రిల్ 15 తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎంట్రెన్స్ ఎగ్జామ్ తోపాటు విద్యార్థులు తమ క్యాంపస్ సీటు కావాలో దరఖాస్తుతో పాటుగానే అప్లై చేసుకోవాలి. విద్యార్థులు రాసిన సిట్ పరీక్షల ఫలితాలను వారు ఎంచుకున్న క్యాంపస్‌లకు పంపి మెరిట్ లిస్ట్ ఆధారంగా విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుంది. మరింత సమాచారం కోసం 7680934525 నెంబరును సంప్రదించవచ్చు. షాద్‌నగర్‌కు చేరువలో అంతర్జాతీయ యూనివర్సిటీ ఉండటం స్థానికులకు కలసి వచ్చే అంశంగా చెప్పవచ్చు.

# చల్ ఖేలెంగే కబడ్డీ

- కీసరలో రెండు రోజులు కబడ్డీ పోటీలు
- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి 50వ వార్షికోత్సవం పురస్కరించుకుని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు
- యువత కోసం కీసరలో ఆర్గనైజింగ్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు గుర్రం శ్రీధర్ రెడ్డి



పోటీలకు ఎస్సి కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ సిద్ధం





**కీసర,మేజర్ న్యూస్,(మార్చి 17):** యువతరంను క్రీడావంతులను చేయాలనే సంకల్పంతో కీసరలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీకారం చుట్టాడు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుర్రం శ్రీధర్ రెడ్డి. మేడ్చల్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి 50వ వివాహ వార్షికోత్సవంలో భాగంగా ఈ పోటీలు జరుగనున్నాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డికి వీరాభిమాని అయిన గుర్రం శ్రీధర్ రెడ్డి ఇప్పటికి కీసరలో సామాజిక బాధ్యతతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన విషయం అందరికి తెలిసిందే.

**రెండు రోజులు ఆటల పండగే**

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలో ఉన్నంత ఉత్సహం యువతలోను ఉండాలనే ఆలోచనతో రెండు రోజుల పాటు కీసర ఎస్సి కమ్యూనిటీ హాల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఏర్పాటు చేస్తున్నారు గుర్రం శ్రీధర్ రెడ్డి. ఈ నెల 20, 21వ తేదీలు సాయంత్రం 4గం ల నుండి రాత్రి 10గం.ల వరకు పోటీలు జరగనున్నాయి. ఈ రెండు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీలకు సంబంధించి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షులు కాసాని వీరేంద్ర ముదిరాజ్ చేతుల మీదుగా మంగళవారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.



బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు, క్రీడల ఆర్గనైజర్ గుర్రం శ్రీధర్ రెడ్డి

**బహుమతులు ఇలా...**

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుర్రం శ్రీధర్ రెడ్డి ఆర్గనైజేషన్ రెండు రోజుల పాటు జరిగే కబడ్డీ ప్రారంభోత్సవంకు ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షులు కాసాని వీరేంద్ర ముదిరాజ్, మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి చామకూర మహేందర్ రెడ్డి, చామకూర భద్రా రెడ్డిలు విచ్చేస్తున్నారు.

పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా నగదు 50వేలు, రెండో బహుమతిగా 25వేలు, మూడో బహుమతిగా 10వేలు, నాలుగో బహుమతిగా 10వేలు ఇవ్వనున్నట్లు ఆర్గనైజర్ తెలిపారు.

**పోటీలో నియమాలు...**

సూచనలు:

అంపైర్ల నిర్ణయమే తుది నిర్ణయం.

ఒక టీంలో ఆడిన వ్యక్తి మరొక టీంలో ఆడరాదు.

టీంను పిలవగాని ప్రాంగణంలోనికి రాగలరు. లేనిచో ఆ టీంను క్రాస్ చేయబడును.

క్రీడల ముగింపు రోజు క్రీడాకారులకు భోజన వసతి కల్పించబడును.

## ముదిరాజ్ సంఘంకు పూర్తిస్థాయిలో పనిచేస్తా

- వన్నీగూడా ముదిరాజ్ సంఘం నూతన అధ్యక్షులుగా రాగుల గణేష్ ముదిరాజ్ నియామకం



**కీసర, మేజర్ న్యూస్,(మార్చి 15):** ముదిరాజ్ కుల ఆత్మగౌరవం కోసం, రక్షణ కోసం తాను శక్తివంచన కృషిచేస్తానని రాగుల గణేష్ ముదిరాజ్ హామీ ఇచ్చారు. కీసర అనుబంధ గ్రామం వన్నిగూడ ముదిరాజ్ సంఘం నూతన కమిటీ నియమితమైంది. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధ్యక్షు, కార్యదర్శులను ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తునట్లు వారు తెలిపారు.

నూతన కమిటీ నియామకం...

మండల సంఘం నూతన అధ్యక్షులుగా: రాగుల గణేష్ ముదిరాజ్.

ఉపాధ్యక్షులు: రాగుల బాలకృష్ణ, రెడ్డబోయిన మధుకర్ ముదిరాజ్, దేసు పవన్ కుమార్ ముదిరాజ్.

ప్రధాన కార్యదర్శి : రెడ్డబోయిన మహేష్ ముదిరాజ్.

ట్రెసరర్ : ఎర్ర వెంకటేష్ ముదిరాజ్,

కార్యదర్శులు :రాగుల రాజ్ కుమార్ ముదిరాజ్,రెడ్డబోయిన భుక్షపతి, రాగుల లక్ష్మీనారాయణ ముదిరాజ్,

కార్యవర్గ సభ్యులు : పల్లెపాటి లక్ష్మయ్య ముదిరాజ్ , అబ్రబోయిన వెంకటేష్ ముదిరాజ్ , కుక్కదువ్వ భాస్కర్ ముదిరాజ్. సలహాదారులు : అంద్యాల బాలకృష్ణ ముదిరాజ్, రాయర పురం రమేష్ ముదిరాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాగుల గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ముదిరాజ్ సంగం నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముదిరాజ్ సంఘం సభ్యులతో పాటు గ్రామస్తులు సహకారంతో గ్రామ అభివృద్ధికి తోడ్పడతారని అన్నారు.

## నిరుపేదల అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (మార్చి 17):** నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందనీ మార్కెట్ కమిటీ చైర్మన్ బి. ఎస్ ఆంజనేయులు ముదిరాజ్, సర్పంచ్ చంద్రభూపాల్ రావు అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధుల నుండి కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన గుండ చెన్నమ్మ, గుండా నడిపి కిష్టయ్యల పొలంలో బోరు మంజూరు చేసి త్రవ్వించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బోయిని కృష్ణయ్య, నీటి వనరుల శాఖ అధికారి భాగ్య మేడం, మాజీ సభ్యుడు బాలకృష్ణయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

# ప్రమాదాల సమయంలో సమన్వయం కీలకం

- ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులు
- మేడ్చల్ కలెక్టరేట్‌లో కెమికల్ ప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (మార్చి, 17):** కర్మాగారాలు, పరిశ్రమల్లో సంభవించే కెమికల్ బ్లాస్టలు, లీకేజీలు, బాంబు పేలుళ్ల వంటి అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారిని రక్షించి సహజ పరిస్థితులు నెలకొల్పే విధానాలపై జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌డిఆర్ఎఫ్ అధికారి గౌతం కుమార్ మాట్లాడుతూ,... కెమికల్ ప్రమాదాల సమయంలో విడుదలయ్యే వాయు కాలుష్య సాంద్రతను బట్టి తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందించే విధానం, రక్షణ చర్యలపై సవివరంగా వివరించారు. ప్రమాదాల సమయంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం అత్యంత ముఖ్యమని, ఫీల్డ్ ఆపరేషన్లలో సిబ్బంది ఎక్కువసేపు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. వారి భద్రత కోసం ప్రత్యేక కిట్లు, మాస్కులు, గ్లౌజులు, రక్షణ దుస్తులు ధరించడం అవసరమని సూచించారు. బాధితులను కాపాడడమే కాకుండా సిబ్బంది తమను తాము రక్షించుకునే విధానాలను కూడా ప్రదర్శించారు. ఇలాంటి ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్‌లో ఉపయోగించిన క్లోరిన్ వంటి రసాయనాల ప్రభావం, వాటి నియంత్రణ విధానాలపై వివరించారు. ఎన్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక, కర్మాగారాలు, వైద్య విభాగాల సమన్వయంతో ఈ మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు డీసీపీలు వెంకట్ రెడ్డి, హనుమంతరావు, డిఆర్ఓ చంద్రావతి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ లీకేజీ కారణంగా రోడ్డుపై ప్రవహిస్తూ మురికి కాలువలో కలుస్తున్న త్రాగునీరు

## ఘనంగా షబ్,ఎ,ఖదర్ ఉత్సవాలు



**దౌల్తాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 17):** మండలం లోని ఈర్లపల్లి గ్రామంలోషబ్-ఎ-ఖదర్ ఉత్సాహ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందని మస్జిద్ కమిటీ అధ్యక్షుడు సర్దార్ సాబ్ ముహమ్మద్ ఖలీల్ తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... ప్రతి ఏడాది షబ్-ఎ-ఖదర్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సారి కూడా ఘనంగా జరుపుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ పెద్దలు ఎండి సలీం, కమ్మరి మౌలాలి, జబ్బర్ మౌల్సబ్, కమ్మరి సలీం, కమిటీ యూత్ అధ్యక్షులు కాజా, ముమ్మత్ సమీర్ అబ్దుల్ అజీజ్, కదిర్ పాషా, కాజా పాషా మరియు తదితరులు పాల్గొన్నారు.



## ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

**కొడంగల్, మేజర్ న్యూస్ (మార్చి 17 ):** కొడంగల్ మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామంలో సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫా కిట్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదే విధంగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేందర్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ జనార్ధన్, వార్డు సభ్యులు మోహన్, పకీరప్ప, సాయిలు, లక్ష్మప్ప, సయ్యద పాష, అప్సర్, మహేశ్, అంజయ్యగౌడ్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# చించోడ్ ప్రభుత్వ పాఠశాలకు ఎల్ఈడీ టీవీ, ప్రింటర్ బహుకరణ...

**ఔదార్యాన్ని చాటిన సీనియర్ జర్నలిస్టు బొబ్బిలి ప్రవీణ్...**






ఫరూఖ్‌నగర్,మేజర్‌న్యూస్(మార్చి17): మండల పరిధిలోని చించోడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు షాద్‌నగర్ సీనియర్ జర్నలిస్టు బొబ్బిలి ప్రవీణ్ ఎల్ఈడీ టీవీతో పాటు ప్రింటర్‌ను బహుకరించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరుణ, గ్రామ సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్‌లతో కలిసి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నిర్వాహకులు సీనియర్ జర్నలిస్టు బొబ్బిలి ప్రవీణ్ టీవీ, ప్రింటర్‌లను అందజేశారు. ఈ సంధర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా

ప్రభుత్వ పాఠశాలలకు, నిరుపేద విద్యార్థులకు తమ వంతుగా అండగా నిలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ప్రవీణ్ తెలిపారు. సంస్థ ద్వారా బొబ్బిలి ప్రవీణ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను గ్రామస్థులతో పాటు పలువురు కొనియాడారు. ప్రవీణ్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంశించారు. అనంతరం దాతను గ్రామస్థులు, ఉపాధ్యాయ బృదం, విద్యార్థులు శాలువాలతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలిగి, అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రసైల్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో లార్డ్స్ విద్యార్థుల సత్తా

**- గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలతో జాతీయ స్థాయిలో మెరిసిన ప్రతిభ - నిహాన్ కప్2026లో ఘన విజయం - చైర్మన్, వైస్ చైర్మన్ అభినందనలు**





బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 17): బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ హై స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 'నిహాన్ కప్2026'లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. మార్చి 14, 15 తేదీల్లో జరిగిన ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకుని పాఠశాలకు గర్వకారణమయ్యారు.ఈ పోటీల్లో ఎం. అక్షర గౌరీ, పీ. యుతిక, యన్. వీరంద, యం. శ్రీనీమాన్, సిహెచ్. మణికంఠ, బి. రిషి, ఎన్. చంద్రవర్ధన్, యం. రణవీర వంటి విద్యార్థులు ప్రతిభ చాటుకుని అత్యధిక పతకాలు సాధించిన పాఠశాలగా లార్డ్స్ హై స్కూల్ గుర్తింపు పొందింది.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సిద్ధాల బీరప్ప విద్యార్థు

లను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో విజయం సాధించడం గొప్ప విషయం అని ప్రశంసించారు. వైస్ చైర్మన్ బెర్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నిహాన్ కప్ దేశ

వ్యాప్తంగా పేరుగాంచిన కరాటే పోటీ అని, అలాంటి వేదికపై తమ విద్యార్థులు విజయం సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించేలా ప్రోత్సహించడం లార్డ్స్ పాఠశాల లక్ష్యమని ఆయన తెలిపారు. అదేవిధంగా జిల్లెల గూడ లార్డ్స్ హైస్కూల్లో క్రీడో సంస్థ ఆధ్వర్యంలో క్రీసలీస్ పాఠ్య విధానంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ వైస్ చైర్మన్ హాజరై వారు మాట్లాడుతూ... క్రీడో పాఠ్య విధానం ఆటల నేర్చుకునే విధానాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థులు ఆలోచన శక్తి, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందినీ పేర్కొన్నారు. ఈ విధానం విద్యార్థుల్లో బుద్ధి, భావోద్వేగ, ప్రవర్తన వికాసానాన్ని సమగ్రంగా పెంపొందించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఆధునిక విద్యా విధానాల్లో నేటి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని భవిష్యత్తులో వారు సృజనాత్మకంగా ఆలోచించే వ్యక్తులుగా ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు.అభినందన కార్యక్రమంలో డైరెక్టర్ సిద్ధాల శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇన్‌చార్జ్ రేఖా సాగర్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యల్లో తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్, విద్యాశాఖల్లో అవినీతి మోత మోగుతోంది..?

- సీఎం సమాధానం చెప్పాలి: బీజేపీ నేత కోలన్ శంకర్ రెడ్డి
- "అధికారుల దందాపై
- సీ ఎం మౌనం ఎందుకు..?:బీజేపీ"
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలంటూ డిమాండ్





బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 17): రాష్ట్రంలో మున్సిపల్ శాఖ, విద్యాశాఖల్లో విపరీతమైన అవినీతి కొనసాగుతోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు మాజీ సింగిల్ విండో చైర్మన్, కో – ఆపరేటివ్ సేల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి ఆరో పించారు. ఈ రెండు కీలక శాఖలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధీనంలో ఉన్నప్పటికీ, గత రెండున్నరేళ్లుగా అవినీతి నియంత్రణలో ఎలాంటి పురోగతి కనిపించలేదని విమర్శించారు.అధికారులు విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతుంటే ముఖ్యమంత్రి ఎందుకు మౌనం వహిస్తున్నారని సూటిగా ప్రశ్నించారు..?
ఇది నిర్లక్ష్యమా..? లేక మరేదైనా అప్రకటిత అనుమతా..?" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు.మున్సిపల్ కార్యాలయాల్లో లంచాల రాజ్యంగా అగుపిస్తుందన్నారు.సాధారణ ప్రజలు ఇళ్లు నిర్మించుకోవాలన్నా, అదనపు అంతస్తులు వేయాలన్నా మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఫైళ్ల కదలికలకు 'కమీషన్' తప్పనిసరిగా మారిందని అన్నారు.
అదేవిధంగా విద్యాశాఖలో నిధుల దుర్వినియోగం ఆరోపణలు
కేంద్ర ప్రభుత్వం విద్యా సంస్థల అభివృద్ధికి కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగం కావడంలేదని, వాటిలో పెద్ద భాగం దాదాపు 80 శాతం అక్రమాలకు గురవుతోందని ఆరోపించారు.పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడాల్సిన చోట విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు.ఈ రెండు శాఖల్లో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరపాలని బీజేపీ డిమాండ్ చేస్తుందన్నారు. విచారణ అనంతరం బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పదవుల నుంచి తొలగించాలని కోరింది.రాష్ట్రంలో అవినీతి అక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్‌గా మారిందని శంకర్ రెడ్డి విమర్శించారు. ఒకవైపు కేంద్రంపై నిధుల కోసం విమర్శలు చేస్తూనే, మరోవైపు భారీ ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల వ్యయాలు చేపడుతున్నారని ప్రశ్నించారు.అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా రైతులు, మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని అవినీతి నియంత్రణపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీజేపీ హెచ్చరిస్తుందని కొలన్ శంకర్ రెడ్డి మేల్కొన్నారు.

# గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలి



ఆమనగల్లు మేజర్ న్యూస్ (మార్చి 17) గ్రామాలలో నాటక ప్రదర్శనలు చేసే కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని ప్రముఖ సంఘ సేవకులు, ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు,మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము చెప్పారు. సోమవారం రాత్రి మండలంలోని కోనాపూర్ గ్రామంలో పెద్దిరాజు పెద్దమ్మ యక్షగానము నాటకంలో ఆయన పాల్గొని నాటికను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి నాటకాలలో మనిషి జీవితంలో ప్రతినిత్యం ఉపయోగపడే ఎన్నో అర్థాలు ఉంటాయని వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం సమాజానికి ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. కవులు కళాకారుల ఉద్బోధనలు మనిషి జీవితానికి ఎంతో అవసరమని ఆయన వివరించారు. అనంతరం ఆయన నాటక కళాకారులను సన్మానించగా వారు కౌన్సిలర్ పాపిశెట్టి రామును సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సైదులు గౌడ్, శ్రీను నాయక్, గ్రామస్తులు నారయ్య, మల్లయ్య, జంగయ్య, యాదయ్య, గ్రామ యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు



కందుకూరు, మేజర్ న్యూస్( మార్చి 17): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల శిభిరాలు కొనసాగు తున్నాయి.మంగ ళవారం మండలంలోని కందుకూరు, ఉట్లపల్లి,నేదునూరు,పులిమామిడి,ఆకులమైలారం, బేగంపేట్, గ్రామాలలో ఆవులు 517, గేదెలు 403 పశువులకు టీకాలు వేశామని,83 మంది రైతులు లబ్ది పొందినట్లు పశువైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్.దీప్తి, షాహిన్‌షేక్, సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఐకి శుభాకాంక్షలు తెలిపిన లిక్కీ విజయేందర్ రెడ్డి



జల్ పల్లి, మేజర్ న్యూస్ (మార్చ్17): పహాడీ షరీఫ్ సీఐకి శుభాకాంక్షలు తెలిపిన రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు లిక్కి జయేందర్ రెడ్డి.ఈ మేరకు మంగళవారం ఆయన పహాడీ షరీఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి,శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయందర్ రెడ్డి మాట్లాడుతూ. పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందజేసిన డప్పు నవీన్ కుమార్




గండిపేట్ మేజర్ న్యూస్ (మార్చ్ 17 ) రంజాన్ మాసంలో ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ ఈద్ కా తోఫా పథకాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా మంగళవారం హైదర్ షాకోట్ డివిజన్ పరిధిలోని పీరం చెరువు లో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫాను పార్టీ శ్రేణులు అందజేశారు. ఈ సందర్భంగా డప్పు నవీన్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమ కొరకు పని చేస్తుందన్నారు. అన్ని మతాల వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రజాక్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అబ్దుల్ సాదిక్, మహమ్మద్ అమీన్,షేక్ మక్బూల్, సయ్యద్ అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బొంపల్లి మస్జిద్ కమిటీ సదర్‌గా మహమ్మద్ షఫీ ఎంపిక



**దోమ,మేజర్ న్యూస్ (మార్చి 17):** బొంపల్లి మజీద్ కమిటీ (సదర్గా/అధ్యక్షుడు) మహమ్మద్ షఫీ డిప్యూటీ సదర్గా జావిద్ ఖాన్ ను బొంపల్లి మైనార్టీ మత పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి మాకు మస్జిద్ కమిటీ సభ్యులు సదర్, డిప్యూటీ సదర్ పదవులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మత పెద్దలు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## మోమిన్ కలాన్ గ్రామంలో నిరుపేద మైనారిటీలకు రంజాన్ కానుక



**ధారూర్ మేజర్ న్యూస్ (మార్చి 17):** మండల పరిధిలోని మోమిన్ కలాన్ గ్రామంలో నిరుపేద మైనారిటీలకు రంజాన్ పండుగ కానుకగా ధారూర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ రాజుగుప్తా,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రభుగుప్త మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద గొప్ప అనే భేదం లేకుండా అందరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని మా వంతు పండగ కానుకగా నిత్యవసర సరుకులను అందజేశామని ఆయన అన్నారు. హిందూ, ముస్లింలు అందరూ కలిసి మెలసి ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మునిరోద్దిన్ ,మాజీ ఏఎంసీ డైరెక్టర్ అలిసాహెబ్ ,8 వ వార్డ్ నెంబర్ సాయిరెడ్డి ,మాజీ వార్డ్ నెంబర్ అహ్మద్,నాయకులు బిలాల్ పాషా,కలీమొద్దీన్ ,గౌస్ పాషా ,నజిరోద్దిన్ ,లతీఫ్ పాషా,మోమిన్ కలాన్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎండి. ఆమెర్, గ్రామస్తులు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

▶▶ సీఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్



**తాండూరు, మేజర్ న్యూస్ (మార్చి 17):** మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టిఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ గారు ఉన్న రోజుల్లో ఆశా కార్యకర్తలను గుర్తించి వారి శ్రమని గౌరవించి దాదాపుగా 10000 జీతం వరకు పెంచి ప్రతినెల 1వ తేదీ నాడే జీతాలు వచ్చేవని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూడు మూడు నెలల వరకు పాత జీతాలు కూడా ఇవ్వడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో పెట్టిన విధంగా నెలకు 18 వేల రూపాయల జీతం ఇవ్వాలని, ఆశా కార్యకర్తలకు అర్హులైన వారికి ఏఎన్ఎం, జిఎన్ఎమ్, పోస్టులు ఇవ్వాలని, ఆరోగ్య భీమా 50 లక్షల వరకు ఇవ్వాలని, ఇల్లు లేని పేద ఆశలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ఆశలకు పెన్షన్ నెలకు పదివేల ఇవ్వాలని, డిమాండ్ చేశారు. ఐదు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలో సంపూర్ణంగా ఆశాలు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం వైఖరి ఎలాగా కొనసాగితే సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రతి ఒకటి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వానికి కార్మిక వర్గం రాబోవు కాలంలో తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్. మాధవి కె. పద్మ సునీత, యాదమ్మ, కౌసల్య, రాదా, శశికళ, పద్మ, అరుణ, యశోద, మంగమ్మ, పద్మావతి, రమాదేవి, రేఖ, యాదమ్మ తదితరులు ఉన్నారు.

# గ్రామ పంచాయతి-సీసీ రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయాలి

▶▶ మారేపల్లి, గాజీపూర్, జనగాం , కందనెల్లితండా గ్రామాలల్లో పర్యటన ▶▶ ఈ నెల 25 వరకు సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలి ▶▶ జిల్లా పరిషత్ జడ్పీ సీఈఓ సుధీర్‌కుమార్

**పెద్దేముల్ , మేజర్‌న్యూస్(మార్చి - 17):** గ్రామ పంచాయతి భవనం పనులు , సీసీ రోడ్ల పనులు సకాలంలో పూర్తి చేయాలని వికారాబాద్ జడ్పీ సీఈఓ సుధీర్‌కుమార్ అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలంలోని మారేపల్లి, జనగాం, గాజీపూర్, కందనెల్లితండా గ్రామాలల్లో పర్యటించి సీసీ రోడ్డు పనులను, గ్రామ పంచాయతి భవనం పనులను పరిశీలించారు. ఈ నెల 25 వరకు సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ రతన్‌సింగ్‌ను ఆదేశించారు. మారేపల్లి గ్రామంలో వివో భవనం నిర్మాణ పనులు, మరియు సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ సునితతో మాట్లాడి త్వరలో పనులు ప్రారంభం చేయాలని తెలియచేశారు. గాజీపూర్ గ్రామంలో గ్రామ పంచాయతి భవనం పనులు, సీసీ రోడ్డు పనులను ప్రారంభించుటకు గ్రామ సర్పంచ్ హేమలత, ఉప సర్పంచ్ ఎల్లప్ప, వార్డు సభ్యులతో మాట్లాడి పనులు ప్రారంభం చేయాలని తెలియచేశారు. జనగాం గ్రామంలో పల్లె పకృతి, గ్రామ పంచాయతి భవనం పనులను పరిశీలించారు. అభివృద్ది పనులు త్వరలో పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్ అరుణకు తెలియచేశారు. కందనెల్లితండా సీసీ రోడ్డు పని ప్రాతంను సందర్శించారు. పనులు త్వరల్లో పూర్తి అయ్యేల చుడాలని సర్పంచ్ ఆనంద్‌నాయక్‌ను కోరారు. వారితో పాటు పీఆర్ డీఈ నాగభూషణం, ఎంపీడీఓ రతన్‌సింగ్, మండల పీఆర్ఏఈ వినోద్‌కుమార్‌తో పాటు ఆయా గ్రామాల పంచాయతి కార్యదర్శులు నర్సింహరెడ్డి, రమేష్ , నవితతో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ మాట్లాడుతూ మండలానికి మంజూరైన సీసీ రోడ్డు పనులు త్వరల్లో పూర్తి అయ్యేల చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనులు నాణ్యతగా ఉండేల చుడాలన్నారు. పనులు సక్రమంగా లేవని ఎవరైన పిర్యాదులు వస్తే తప్పకుండా వాటిపై విచారణ చేయడం జరుగుతుందన్నారు.




మారేపల్లిలో పనులు త్వరల్లో పూర్తి చేయాలని సర్పంచ్‌కు తెలియచేస్తున్న జడ్పీ సీఈఓ

## మహిళలకు ఆర్థికంగా ఎదగాలి



**దోమ, మేజర్ న్యూస్ (మార్చి 17):** దోమ మండలపరిధిలో ని మోత్కూరు గ్రామానికి ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 కార్యచరణ ప్రణాళికలో భాగంగా బ్యాంకు రుణాల విడుదల ఎన్ పి ఏ రికవరీ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వికారాబాద్ జిల్లా డిఆర్డిఓ శ్రీనివాస్ ,డి ఇ ఉమేష్ గ్రామానికి హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులతో డి ఆర్ డి ఓ మాట్లాడడం జరిగింది. ప్రతి సంఘంలో అప్పు తీసుకున్నటువంటి మహిళ సకాలంలో చెల్లించి జీవనోపాదులను ఏర్పరచుకొని అభివృద్ధి చెందాలని కోరారు. తీసుకున్నటువంటి రుణాలను సకాలంలో చెల్లించనట్లయితే అధిక వడ్డీ భారం మీరు భరించవలసి వస్తుంది. దానివల్ల నష్టపోవడం జరుగుతుందని తెలియజేశారు. తెలియజేశారు. సంఘాలలోని మహిళలు ప్రతి ఒక్కరు కూడా జీవనోపాదులను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఇట్టి సమావేశంలో మహిళలు గ్రామ సంఘం ఆఫీసు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని తెలియజేయడంతో డిఆర్డిఓ సాధ్యమైనంత తొందరలో ఎస్ ఏచ్ జి ఫెడరేషన్ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని సర్పంచ్ ఆనంద్ ని కోరారు. మోత్కూర్ గ్రామ మహిళలందరూ సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఇంకా సంఘాలలో చేరనటువంటి సభ్యులను సంఘాలలో చేర్పించాలని,ఎన్ పి ఏ లేకుండా రికవరీలు చేయాలని జీవనోపాదులు ఏర్పాటుకు కొత్త రుణాలుఇప్పించాలని సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలోడి ఆర్ డి ఓ,డి శ్రీనివాస్,ఇ ఉమేష్ కుమార్ , గౌరవ సర్పంచ్ ఆనంద్, ఏపీఎం శోభ,సీసీ ,వి ఓఏ లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



**ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(మార్చి, 17):** ఘట్‌కేసర్ గట్టు మైసమ్మ జెసిబి ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సమావేశం అయ్యారు. గట్టు మైసమ్మ గుట్ట దేవాలయ ఆవరణలో సమావేశమైన సభ్యులు నూతన ధరలను నిర్ణయిస్తూ తీర్మానించారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెసిబి ఓనర్లు పాల్గొన్నారు.

## ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ




**కొడంగల్, మేజర్ న్యూస్ (మార్చి 11):** కొడంగల్ మున్సిపాలిటీ కార్యాలయంలో వైస్ చైర్మన్ శంకర్‌నాయక్ ముస్లిం సోదరులకు మంగళవారం రంజాన్ తోఫా కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నయీమ్ మాట్లాడుతూ మైనారిటీల అభ్యున్నతి, సంక్షేమం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆసిఫ్‌ఖాన్, కౌన్సిలర్ సయ్యద్ హమీద్, కాంగ్రెస్ నాయకులు బత్తుల నర్సిములు, అశ్వాఖ్, సిరాజుద్దీన్, ఎంఐఎం నాయకులు షేక్ రుమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



**కొడంగల్, మేజర్ న్యూస్ (మార్చి 17):** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులోని ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ దాము రంజాన్ తోఫా కిట్‌లు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డులోని ముస్లింలకు ఆయన కిట్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. మైనారిటీల అభ్యున్నతి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**పెద్దేముల్ , మేజర్‌న్యూస్(మార్చి-17):** ప్రభుత్వ అనుమతి లేకుండా తరలిస్తున్న అక్రమ ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం పెద్దేముల్ పోలీసులు మంబాపూర్ గ్రామ శివారల్లో పట్టుకున్నారు. పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ తెలపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం పెద్దేముల్ మండల మంబాపూర్ గ్రామ శివారల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక ట్రాక్టర్ తరలుతున్న విషయాన్ని గమనించి పోలీసులు పట్టుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేయడం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియచేవారు.

# బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఏసీబీ దుమారం

**అధికారులురాజకీయ నేతల అపవిత్ర బంధం బట్టబయలు: అర్కాల కామేష్ రెడ్డి**

**కమిషనర్ రీ-ఎంట్రీపై అనుమానాల మబ్బులు**

**"దొంగ ఫైళ్ల రక్షణకే తిరిగి పోస్టింగ్" అంటూ తీవ్ర ఆరోపణలు**



బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 17): బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల జరిగిన ఏసీబీ సోదాలు అనేక విధాల సంచలనాలకు దారితీశాయి. అధికార యంత్రాంగం మరియు అధికార పార్టీ నేతల మధ్య ఉన్న అపవిత్ర బంధాన్ని ఈ సోదాలు బట్టబయలు చేశాయని మీర్ పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కాల కామేష్ రెడ్డి ఘాటుగా ఆరోపించారు.కేవలం నెల రోజుల క్రితం బదిలీ అయిన కమిషనర్ సరస్వతి మళ్లీ అదే స్థానానికి రావడం వెనుక ఉన్న అసలు రంగు ఇప్పుడు బయట పడిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇది యాదృచ్ఛికం కాదని, పూర్వపు అక్రమాలను కప్పి పుచ్చుకునే ప్రయత్నమని మండిపడ్డారు.

అవినీతి చక్రంలో అధికారులు కీలకం...?, మని కార్పొరేషన్‌లో భారీ స్థాయిలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ, కమిషనర్ సరస్వతి, ఏ ఎం సీ శ్రీధర్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరి తదితరులు ఒక సమన్వయంతో ప్రజా ధనాన్ని దోచు కుంటున్నారని

కామేష్ రెడ్డి విమర్శించారు. ముందస్తు ప్రణాళికతో ఈ వ్యవహారం సాగుతోందని పేర్కొన్నారు.శానిటేషన్‌లో కోట్ల దోపిడీ ఆరోపణలు శానిటేషన్ విభాగంలో కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని, బినామీ ఏజెన్సీలతో కుమ్మక్కై నిబంధనలను పక్కన బెట్టి నిధులను మళ్లిస్తున్నారని ఆరోపించారు.ముఖ్యంగా రూ. 9.5 లక్షల లోపు పనుల పేరుతో ఫైళ్లు సృష్టించి, టెండర్ నిబంధనలను తప్పించుకుంటూ భారీగా నిధులు కాజేస్తున్నారని వివరించారు.రాజకీయ అండతోనే అధికారుల దందా...? చేస్తున్నారని,

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను తిరిగి అదే స్థానాల్లో నియమించడం వెనుక రాజకీయ అండ ఉందని కామేష్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు అధికారులను పావులుగా వాడుకుని ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు.ఒక అధికారి బదిలీ అయిన నెలలోనే తిరిగి అదే కుర్చీలో కూర్చోవడం యాదృచ్ఛికం కాదు. ఇది అక్రమాలకు కవచంగా ఉండాలని ఉద్దేశం, ప్రజల సొమ్ముతో కమీషన్ల రాజకీయాలు నడుస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలి, అని ఆయన తీవ్రంగా విమర్శించారు.ఏసీబీ సోదాల్లో వెలుగులోకి వచ్చిన అంశాలపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.అవినీతి అధికారులకు అండగా నిలుస్తున్న రాజకీయ నేతల మీలో ఎవరు..?, అసలు స్వరూపాన్ని ప్రజల ముందుకు తీసుకువస్తామని, అవసరమైతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, భారత రాష్ట్ర సమితి నేతలు తోపాటు మీర్ పేట్ డివిజన్ అధ్యక్షులు హెచ్చరించారు.

# బాలాపూర్‌లో డ్రైనేజీ దుర్వాసన ప్రజల ఆవేదన

**పాత పైపుల వల్ల ఇళ్లలోకి మురుగు తాగునీటిలో కలుషితం**

**కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి వినతి**

**తక్షణ చర్యలకు ఆదేశాలు పనులు ప్రారంభించాలంటూ సూచనలు**

బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 17): జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్, బాలాపూర్ 62వ డివిజన్‌లో నెలకొన్న పలు ప్రాధాన్య సమస్యలను స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి విజ్ఞప్తి వినతిలో వినిపించారు.

తుక్కుగూడ క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలపై వివరణాత్మకంగా నివేదించారు.బాలాపూర్ పాత గ్రామంలోని గడ్డం వారి వీధిలో గత 30 ఏళ్ల క్రితం నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్, సీసీ రోడ్డు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా డ్రైనేజీ పైపుల పరిమాణం చిన్నగా ఉండటం, సరైన లెవెల్ లేకపోవడం వల్ల మురుగు నీరు ఇళ్లలోకి చేరుతుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.ఇంకా ప్రమాదకర విషయం ఏమిటంటే, డ్రైనేజీ పైపుల పక్కనే ఉన్న మంచినీటి పైప్‌లైన్‌లోకి మురుగు నీరు కలుస్తుండటంతో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతూ, ఆ వీధిలో నూతన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ (యు జి డి ), కొత్త మంచినీటి పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు



చేయాలని విజ్ఞప్తి చేశారు.వినతిపై స్పందించిన లక్ష్మారెడ్డి వెంటనే సంబంధిత అధికారు.లతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు.బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫోన్ ద్వారా సూచనలు ఇచ్చి, పనులు ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బాల్ నింగని జంగయ్య, కాంటెస్టెడ్ కార్పొరేటర్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్ర రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## పండ్ల తోటల పెంపకంలో అధికారుల సూచనలు పాటించాలి : మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి



కడ్తాల్, మేజర్‌న్యూస్ (మార్చి 17): పండ్ల తోటల పెంపకం, అధిక దిగుబడి కొరకు రైతులంతా ఉద్యానవన అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మారెడ్డి కోరారు. పంటల సాగు, పండ్లతోటల పెంపకంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడులు, అధిక దిగుబడులతో పాటు పంటల నష్టాలను నిలువరించవచ్చని ఆయన పేర్కొన్నారు.కడ్తాల్ గ్రామ రైతుల అభ్యర్థన మేరకు ఉద్యానవన అధికారులు మాజీ సర్పంచ్ లక్ష్మినర్సింహ్మారెడ్డితో కలిసి గ్రామంలోని పలువురు రైతులు సాగుచేసిన పండ్ల తోటలను మంగళవారం సందర్శించారు. ఈ మేరకు ఉద్యానవన విస్తరణ అధికారి శ్రవణ్ రైతులకు పండ్ల తోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా జామతోట పరిస్థితిని పరిశీలించిన అధికారి, పంట దిగుబడిని మెరుగుపర్చడానికి, నాణ్యతను పెంచడానికి సూచనలు చేశారు. తోటలో నీటి నిర్వహణ, ఎరువుల వినియోగం వంటి అంశాలను పరిశీలించిన అధికారి, సమయానుకూలంగా ఎరువులు వేయడం, సేంద్రియ పద్ధతులను అనుసరించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలియజేశారు. అదేవిధంగా పండ్లపై వచ్చే కీటకాలు, వ్యాధులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి సూచించారు. తోటలో పాడైన లేదా వృద్ధాప్యానికి చేరిన కొమ్మలను తొలగించడం (ప్రూనింగ్) ద్వారా కొత్త కొమ్మల పెరుగుదల మెరుగుపడుతుందని, చెట్ల మొదటన వేయడానికి వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లక్ష్మినర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ రైతులంతా వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు మూడ అశోక్ కుమార్, మూడ వెంకటేష్ , ఉద్యానవనశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కాసువాగు భూములపై రైతుల ఆవేదన

- అక్రమ ప్రహరీ నిర్మాణాలపై కేఎల్ఆర్‌కు ఫిర్యాదు



బాలాపూర్, మేజర్ న్యూస్ (మార్చి 17):మహేశ్వరం నియోజకవర్గంలోని నాదర్‌గుల్ గ్రామ పరిధిలో కాసువాగు భూములపై అక్రమ ప్రహరీ నిర్మాణాలు జరుగుతున్నాయని, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ మేరకు బడంగ్‌పేట్ డివిజన్‌కు చెందిన పలువురు రైతులు కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. రైతుల వివరాల ప్రకారం, నాదర్‌గుల్ గ్రామంలోని సర్వే నంబర్ 613లో సుమారు 373 ఎకరాల భూమిని ఓ ప్రైవేటు సంస్థ అక్రమంగా ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతోందని ఆరోపించారు. దీనివల్ల తమ సాగుభూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.ఫిర్యాదుపై స్పందించిన లక్ష్మారెడ్డి రెవెన్యూ అధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. కాసువాగు రైతులకు న్యాయం చేయాలని, అక్రమ నిర్మాణాలను వెంటనే అడ్డుకోవాలని అధికారులను కోరారు.తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో లక్ష్మారెడ్డిని ప్రత్యేకంగా కలిసిన రైతులు, గత కొన్నేళ్లుగా ప్రైవేటు వ్యక్తుల చేతిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ భూములను రక్షించాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... అవసరమైతే పోలీస్ బలగాల సహా యంతోనైనా అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడలను తొలగించాలన్నారు. పేదల కోసం ఇందిరమ్మ పాలనలో సీలింగ్ కింద ఇచ్చిన భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమానికి గురికాకుండా కాపాడుతామని స్పష్టం చేశారు.కాసువాగు రైతులు ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గంలోని నాదర్‌గుల్, బడంగ్‌పేట్ డివిజన్ల కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### నేడు రెడియల్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు అవగాహన

**- చౌదరి గూడెం మండల తహశీల్దార్ జగదీశ్వర్ - ముఖ్య అతిథిగా షాద్ నగర్ అర్. డి. ఓ**

జిల్లేడు– చౌదరి గూడెం: మేజర్ న్యూస్:( మార్చి:17): బుధవారం నాడుమండల పరిధిలోని లచ్చాం పేట గ్రామ శివారులో నుండి రెడీ ఎల్ రోడ్డు లో భూములు కోల్పోతున్న రైతుల కు అవగాహన కల్పిం చాలని తహశీల్దార్ జగదీశ్వర్ తెలిపారు. తహశీల్దార్ జగదీశ్వర్ మాట్లాడుతూ షాద్ నగర్ అర్ డి ఓ ఆదేశాల మేరకు ఈ రోజు భూములు కోల్పోతున్న రైతుల కు అవగాహన కల్పించడం కోసం సదస్సు నిర్వహించాలని జగదీశ్వర్ తెలిపారు. మండల పరిధిలోని మీడియా సోదరులు అందరూ కలిసి ఈ విషయాన్ని రైతులకు పత్రిక ముఖంగా తెలియచేయాలని నేడు సాయంత్రం 3 గంటలకు లచ్యంపెట గ్రామములో అవగాహన సదస్సు నిర్వహించాలని తహశీల్దార్ జగదీశ్వర్ తెలిపారు. రైతులు సకాలములో సదస్సుకు రోడ్డు కోల్పోతున్న రైతు లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొనాలని జగదీశ్వర్ తెలిపారు.

## మైసిగండి మైసమ్మను దర్శించుకున్న హైద్రాబాద్ మాజీ మేయర్



కడ్తాల్, మేజర్‌న్యూస్ ( మార్చి 17):కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని మంగళవారం హైద్రాబాద్ మాజీ మేయర్ విజయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జఠావత్ ప్రేమజవహర్‌లాల్ నాయక్ మాజీ మేయర్‌కు ఘనంగా స్వాగతం పలికి గర్భగుడిలో మైసమ్మ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాజీ మేయర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కేతావత్ హీరాసింగ్‌నాయక్, మాజీ వార్డుసభ్యులు తులసిరామ్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు సాయికుమార్ పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల అమలు కోరుతూ బీజేపీ వినతిపత్రం

- హామీలు వెంటనే అమలు చేయాలి: కొరివి కృష్ణా ముదిరాజ్



**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (మార్చి 17):** భారతీయ జనతా పార్టీ షామీర్‌పేట్ మండల్ అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు కొరివి కృష్ణా ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృద్ధులకు రూ.2,000 నుండి రూ.4,000 వరకు పెన్షన్ ఇస్తామని, గృహిణులకు నెలకు రూ.2,500 అందజేస్తామని, కళ్యాణ లక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని, రైతులకు రైతు భరోసా మొత్తాన్ని రూ.5,000 నుండి రూ.7,500కు పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలను హామీలతో నమ్మబలికి ఇప్పుడు విస్మరించడం తగదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఈ హామీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కైరా గణేష్, మాజీ సర్పంచ్ మామిళ్ల అశోక్, బ్రహ్మానంద రెడ్డి, సిహెచ్ వెంకటేష్, గౌరారం రమేష్, భీమా నాయక్, పాక మల్లేష్, నాగరాజు ముదిరాజ్, జీవీకే యాదవ్, మహేష్ యాదవ్, డి. చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం-ఎన్.హైమా రెడ్డి

- ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన, విద్యార్థులకు పండ్ల పంపిణీ
- పోషకాహారంపై ప్రత్యేక దృష్టి



మేడ్చల్, మేజర్ న్యూస్, (మార్చి 17): మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పోరేషన్, కీసర సర్కిల్ శామీర్పేట్ డివిజన్ పోతాయిపల్లి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయడంతో పాటు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై వారి ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతపై సంఘ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయురాలు సంధ్య, మనోహరా సేవలను ప్రశంసిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా శక్తి మై వాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్. హైమా రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం వారి ఆరోగ్యం, భవిష్యత్తుకు ఎంతో కీలకమని అన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని, పిల్లల్లో పోషకాహారంపై అవగాహన పెంచడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని, వారి సేవలకు సంఘం తరఫున ఎల్లప్పుడూ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ అంబటి, రాము ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, ప్రశాంత్ గౌడ్, ఎం. రమ్య తదితరులు పాల్గొన్నారు.

# విలేకరులపై ఎఫ్ఐఆర్ నమోదు

- మేడ్చల్ డీఎంహెచ్ఓ ఫిర్యాదుతో సంచలనం
- తప్పుడు వార్తలు, పరువు నష్టం, డబ్బుల డిమాండ్ ఆరోపణలు
- పలువురిపై కేసు నమోదు

**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (మార్చి, 17):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పలువురు పత్రికా విలేకరులు, మీడియా ప్రతినిధులపై శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కావడం సంచలనంగా మారింది... జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సి.ఉమా గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తప్పుడు కథనాల ప్రచారం పోలీసుల వివరాల ప్రకారం "నేటిధాత్రి" దినపత్రికలో మార్చి 12న ప్రచురితమైన కథనంలో డీఎంహెచ్వోపై తీవ్ర దూషణాత్మక, అసత్య ఆరోపణలు ప్రచురించబడ్డాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. "లంచాలు తీసుకుని సినిమా నిర్మాణం", "పదవిని దుర్వినియోగం" వంటి ఆరోపణలు పూర్తిగా కల్పితమని, తన వ్యక్తిగత గౌరవం, వృత్తిపరమైన ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని తెలిపారు.

మరో కథనంతో వివాదం ముదిరింది మార్చి 13న "ఆరోగ్య శాఖలో అధికారుల అవినీతి కుంభకోణం?" అనే శీర్షికతో మరో కథనం ప్రచురించడం ద్వారా తప్పుడు ప్రచారం కొనసాగించారని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, తన వివరణ తీసుకోకుండా వార్తలు ప్రచురించడం జర్నలిజం నైతికతలకు విరుద్ధమని తెలిపారు.

**సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం**

ఈ తప్పుడు కథనాలను వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల ద్వారా ఉద్దేశపూర్వకంగా విస్తృతంగా ప్రచారం చేశారని ఆరోపించారు. "మల్కాజిగిరి ఫ్రంట్ లైనర్స్", "డీఎంహెచ్వో న్యూస్ మేడిపల్లి" వంటి గ్రూపుల్లో వార్తలు షేర్ చేసి అపఖ్యాతి కలిగించే ప్రయత్నం జరిగిందన్నారు.

**డబ్బుల డిమాండ్ ఆరోపణలు:**

ఈ ప్రచారాన్ని ఆధారంగా చేసుకుని కొంతమంది వ్యక్తులు డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో "రాజ్ న్యూస్" పేరుతో వీడియో ప్రసారం చేస్తామని బెదిరించి రూ.5 లక్షలు డిమాండ్ చేసిన ఘటనను కూడా ప్రస్తావించారు.

**పదోన్నతులు, హోదాపై వివరణ:**

తన హోదా, పదోన్నతులపై కూడా తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వ ఉత్తర్వులు మరియు హైకోర్టు తీర్పుల ప్రకారం తాను చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తున్నానని స్పష్టం చేశారు.

**పలువురిపై కేసు నమోదు:**

ఈ వ్యవహారంలోనేటిధాత్రి చీఫ్ ఎడిటర్ కట్ట రాఘవేంద్రరావు, తుపాకుల రమేష్, మరాటి మల్లేష్, రాజ్‌కుమార్‌తో పాటు మరికొందరు వ్యక్తులు ప్రమేయం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**దర్యాప్తు ప్రారంభం:**

ఫిర్యాదు ఆధారంగా శామీర్‌పేట పోలీసులు క్రైమ్ నెంబర్ నమోదు చేసి, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 308(3) ఆర్/డబ్ల్యూ 62 కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తును సంబంధిత అధికారికి అప్పగించి విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్వో విజ్ఞప్తి చేశారు.

## లేబర్ కార్డుతో కార్మికులకు అనేక ప్రయోజనాలు:అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గోపిరెడ్డి

- బీఎంఎస్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల దరఖాస్తుల స్వీకరణ



**మేడ్చల్, మేజర్ న్యూస్ (మార్చి, 17):** భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు సంక్షేమ బోర్డు అందజేసే లేబర్ కార్డు పొందడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చని కుత్బుల్లాపూర్ జోన్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గోపిరెడ్డి తెలిపారు. మంగళవారం మేడ్చల్ పరిధిలోని కేఎల్ఆర్‌లో బీఎంఎస్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కార్డు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ,... లేబర్ కార్డు ద్వారా కార్మికులకు లభించే వివిధ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్మికుల కుటుంబంలో ఇద్దరు కుమార్తెలు ఉంటే వారి వివాహానికి ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారని, ప్రసూతి సమయంలో మహిళా కార్మికులకు కూడా రూ.30 వేల చొప్పున అందజేస్తారని తెలిపారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే కుటుంబానికి గతంలో రూ.6 లక్షలు ఇచ్చేవారని, ప్రస్తుతం దానిని రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. గాయపడిన కార్మికులకు రూ.4 లక్షల వరకు వైద్య ఖర్చుల సహాయం అందిస్తారని తెలిపారు. అదేవిధంగా లేబర్ కార్డు ద్వారా కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు వంటి అనేక ప్రయోజనాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ,... భారతీయ మజ్దూర్ సంఘం చేపట్టిన ఉద్యమాల ఫలితంగా కార్మికులకు అందే ప్రయోజనాలను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం హర్షనీయమన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కార్మికుల రూ.32 కోట్ల క్లెయిమ్‌ల విడుదలకు కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర శాఖ కార్యదర్శి సత్యనారాయణ, సలహాదారు శంకర్, మేడ్చల్ అధ్యక్షుడు వి. తిరుపతి రెడ్డి, కార్యదర్శి ఏం. భార్గవ్ నాయుడు, నాయకులు ఎం. నరసింహారెడ్డి, కేశవ, వెంకటనారాయణ, రమణయ్య, మనోహర్, ఎస్.కే. రసూల్, కృష్ణ రెడ్డి, చెన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి కార్పొరేషన్‌కు రూ.98 కోట్ల నూతన భవనం-అభివృద్ధికి ఊతం

- ఉప్పల్‌లో స్థలం పరిశీలన – ప్రజా సేవలకు ఆధునిక సదుపాయాలు



ఉప్పల్‌లో మల్కాజిగిరి కార్పొరేషన్ నూతన భవన స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు.

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (మార్చి, 17):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు నూతన కార్యాలయ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.98 కోట్ల నిధులు మంజూరు చేయడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది. ఈ నూతన భవనాన్ని అన్ని ఆధునిక సదుపాయాలతో నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకోసం ఉప్పల్ భగయత్ ప్రాంతంలో సుమారు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం ఈ స్థలాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి తదితరులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ,.. మేడ్చల్ మల్కాజిగిరి అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన దృష్టి ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ అమలులోకి వస్తే పరిపాలన మరింత సమర్థవంతంగా మారి ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికుల అభిప్రాయం ప్రకారం ఈ ప్రాజెక్ట్ జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం చేయడంతో పాటు భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**తుర్కయంజాల్ బీజేపీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహా రెడ్డి**



తుర్కయంజాల్, మేజర్ న్యూస్,( మార్చి 18 ) :ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసపూరిత హామీలతో కాలయాపన చేస్తుందని తుర్కయంజాల్ బీజేపీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహా రెడ్డి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చలని మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సత్యనారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నరసింహా రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు.ఇప్పటికి రెండున్నర సంవత్సరాలు గడిచిన ప్రజలకు ఇచ్చిన హామీలో ఏ ఒక్కటి నెరవేర్చకుండా ప్రజల్లో పూర్తిగా విఫలం అయ్యిందని మండిపడ్డారు.యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు మరియు దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడ నెరవేర్చకపోవడంతో నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారని అన్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు దరఖాస్తులు సమర్పించినప్పటికీ వారి సమస్యలు పరిష్కారం కాలేదని,ఆ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బోసుపల్లి ప్రతాప్, కొండ్రు పురుషోత్తం, బచ్చిగళ్ళ రమేష్, నోముల కార్తీక్ గౌడ్ ,మల్లెల ప్రేమ్, నందగిరి సురేష్ గౌడ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# వీబీఎన్ 5కే రన్ 2026”ను ప్రకటించిన వైశ్య బిజినెస్ నెట్‌వర్క్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పారిశ్రామికవేత్తల మధ్య సహకారాన్ని, అభివృద్ధిని ప్రోత్సహించే ఒక చైతన్యవంతమైన కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ అయిన వైశ్య బిజినెస్ నెట్‌వర్క్ (వీబీఎన్ ), “ఒకే సమాజంగా పరుగెత్తండి” అనే ఇతివృత్తంతో వ్యాపార నాయకులు, కుటుంబాలు మరియు విస్తృత సమాజాన్ని ఒకచోట చేర్చే లక్ష్యంతో చేపట్టిన కమ్యూనిటీ ఫిట్‌నెస్ కార్యక్రమమైన వీబీఎన్ 5 కే రన్ 2026ను ప్రకటించడం గర్వంగా ఉంది. ఈ పరుగు మార్చి 22, 2026న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో జరగనుంది. ఫిట్‌నెస్ ద్వారా ఆరోగ్యం, ఐక్యత మరియు నెట్‌వర్కింగ్‌ను అలవర్చుకోవడానికి సభ్యులను, పాల్గొనేవారిని ఇది ప్రోత్సహిస్తుంది. వైశ్య పారిశ్రామిక సమాజాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలను నిరంతరం ముందుకు నడిపిస్తున్న వైశ్య బిజినెస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు శ్రీ శివ కుమార్ ఎమ్మాడి అలియాస్ ఎమ్మాడి మరియు అపెక్స్ ఛైర్మన్ అభిషేక్ చందాల నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఆరోగ్యకరమైన జీవనశైలి బలమైన పారిశ్రామికవేత్తలను, బలమైన సంబంధాలను మరియు బలమైన వ్యాపార పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తుందనే ఆలోచనను ఈ పరుగు ప్రోత్సహిస్తుంది. ఈ కార్యక్రమం యొక్క తత్వాన్ని **నాలుగు సాధారణ వాక్యాలలో సంగ్రహించవచ్చు:** ఫిట్‌నెస్ కోసం పరుగెత్తండి. సమాజం కోసం పరుగెత్తండి. మరింత వ్యాపారం కోసం పరుగెత్తండి. నెట్‌వర్క్ కోసం పరుగెత్తండి -- ఎందుకంటే నెట్‌వర్కే నికర విలువ. ఈ కార్యక్రమానికి ప్రముఖ ముఖ్య అతిథులు కూడా హాజరవుతారు: ఆర్.వి. కర్ణన్, కమిషనర్, జీహెచ్ఎంసీ, వి.సి. సజ్జనార్, ఐపీఎస్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్, టి.జి. భరత్, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వారి ఉనికి, ఆరోగ్యం, నాయకత్వం మరియు అర్థవంతమైన సమాజాన్ని ప్రోత్సహించే సామాజిక కార్యక్రమాల ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

# చిల్డ్రన్స్ వరల్డ్ సేవలు అభినందనీయం

▸▸ చిన్నపిల్లల కోసం తెలంగాణ సారస్వత పరిషత్ పనిచేస్తుంది ▸▸ చిన్న పిల్లల కోసం చిల్డ్రన్స్ వరల్డ్ చేసి సేవలందించడం ప్రశంసనీయం

▸▸ చిల్డ్రన్స్ వరల్డ్ అధినేత మక్కపాటి చంద్రశేఖర రావు భేష్ ▸▸ భాను ప్రకాష్ పనితీరు అభినందనీయం ▸▸ తెలంగాణా సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి



హైదరాబాద్, మేజర్ న్యూస్:తెలంగాణ సరస్వత పరిషత్ కనుగుణంగా చిల్డ్రన్స్ వరల్డ్ చేస్తుందని, అభినందనీయం అని తెలంగాణా సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి విడుదల చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల బాలికల్లో సామాజిక స్వరూపం పొందించేందుకు చిల్డ్రన్స్ చేస్తున్న అభివృద్ధి ఎంతగానో సమాజానికి ఉపయోగకరం అని అన్నారు. చాలా కష్టమైన పరిస్థితిలో ఉన్నామని, యుద్ధాలు చేసే పరిస్థితుల్లో ఉండడం చాలా బాధాకరం అని ఆయన అన్నారు.పిల్లలకు కోసం చిల్డ్రన్స్ వరల్డ్ చేస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరం అని ప్రశంసించారు. శాంతా బయోటెక్స్ అధినేత వరప్రసాద్ రెడ్డి ఏడాదికి ఐదు లక్షల అందిస్తున్నారని అన్నారు.సమాజాన్ని బాగు చేసే శక్తి ఒక్క టీచర్ లోనే ఉంది చాలా మంచి పని చేస్తున్నారు అనేకమంది మీ సంకల్పానికి తోడుగా ఉంటారని నా అభిప్రాయం అని అన్నారు. తాను సైతం పట్టుదలతో చిల్డ్రన్స్ వరల్డ్ చేపట్టే కార్యక్రమానికి సూచనలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానుఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా చిల్డ్రన్స్ వరల్డ్ ప్రత్యేక సంచికను విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. చిల్డ్రన్స్ వరల్డ్ సంస్థ విద్యార్థి, విద్యార్థినుల కోసం, వారిలోని ప్రతిభను వెలికి తీసి భావిలో భారతావని కీర్తి ప్రతిష్టలను ఇనుమడించేలా కృషి చేస్తుందని రాజధాని పబ్లిక్ స్కూల్ అధినేత, చిల్డ్రన్స్ వరల్డ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మక్కపాటి చంద్రశేఖర్ రావు సేవలను అభినందించారు. ముందుగా చిల్డ్రన్స్ వరల్డ్ జనరల్ సెక్రటరీ, మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ పి యన్ భాను ప్రకాష్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక సంచికను తెలంగాణా సారస్వత పరిషత్ అధ్యక్షులు, తెలుగు విశ్వావిద్యాలయం మాజీ కులపతి, సాహితీవేత్త, కవి, పరిశోధకులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి చేతులమీదుగా విడుదల చేయడం చాలా ముదావహమని, వారి ఆశీస్సులు, ప్రోత్సాహం ఇటువంటి సంచికకు చాలా అవసరం అని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ వరల్డ్ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్ హర్షవర్ధన్, బి హెచ్ ఇ యల్ విశ్రాంత పబ్లిక్ రిలేషన్స్ డీప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్ చక్రపాణి,నిజాంపేటలోని రాజధానిరెసిడెన్ష యల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐ. దీపిక, వైస్ ప్రిన్సిపాల్ కే వెంకటేశ్వర రావు మాట్లాడారు. చంద్రమోహన్, రవి అనుపాలా తదితరులు పాల్గొన్నారు. చివరగా తెలంగాణా సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య మాట్లాడుతూ ఈ సంచికలో పెద్దవాళ్ళ ఆర్టికల్స్ తో బాటు పిల్లల రచనలు, చిత్రాలు ఉండడము వారిని రచనా వ్యాసంగం వైపుకు, చదివి విషయాలు గ్రహించడానికి దోహద పడుతుందని చిల్డ్రన్స్ వరల్డ్ సంస్థ నుకొనియాడారు.

# ఉగాది రోజున చందనవెల్లిలో కవి సమ్మేళన సభ






షాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 17)నూతన కవులు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఈనెల 19 గురువారం ఉగాది రోజున మాతృభాష పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి, శతాధిక గ్రంథకర్త, రంగస్థల నటుడు గడిగే భీమకవి సభ ప్రాంగణ పేరుపై కవి సమ్మేళనాన్ని షాబాద్ మండలం చందన వెల్లి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సభానిర్వహకుడు, గ్రామ సర్పంచ్ చేవెళ్ల నవనీత స్వామి తెలిపారు. వారు మాట్లాడుతూ.. నూతన కవులు, కళాకారులను, మాతృభాష తెలుగును ప్రోత్సహించేందుకు ఈ కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉగాది రోజున మధ్యాహ్న 2:30 నుండి ఈ సమ్మేళనం కొనసాగుతుందని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఉన్న ఎంతోమంది కవులను వెలికి తీసుకువచ్చి, వారి రచనలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమ్మేళన కార్యక్రమంలో ప్రతి కవి, కళాకారులు, తమ ప్రతిభను ప్రదర్శించుకోవచ్చని తెలిపారు.ఈ సమ్మేళనంలో కవులు, కళాకారులు, నటులు, భీమకవి అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## స్వీయ ఆత్మ రక్షణ ప్రతి ఒక్కరికి అవసరం :షాబాద్ సిఐ కాంతారెడ్డి




షాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 17)స్వీయ ఆత్మరక్షణ ప్రతి ఒక్కరికి అవసరమని షాబాద్ సిఐ కాంతారెడ్డి తెలిపారు. గత నాలుగు సంవత్సరాల నుండి కరాటే శిక్షణ పొందుతున్న ఎస్ దరహాస్ కు మంగళవారం కరాటే బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ సర్టిఫికెట్ ను షాబాద్ సిఐ కాంతారెడ్డి కరాటే మాస్టర్ నరసింహులు తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రులు పిల్లలకు స్వీయ ఆత్మ రక్షణ కోసం కరాటే, కిక్ బాక్సింగ్ వంటి వాటిలో శిక్షణ ఇప్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మెట పూర్ణచంద్ర, ఈర్లపల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీజ్ చేసిన వాహనాల వేలం

షాబాద్ మేజర్ న్యూస్ (మార్చి 17)ప్రొహిబిషన్ ? ఎక్సైజ్ స్టేషన్, చేవెళ్ల పరిధిలో వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలను పబ్లిక్ వేలం నిర్వహించబడనున్నది.ఈ వేలం కార్యక్రమం తేది: 18-03-2026, ఉదయం 10:30 గంటలకు ప్రొహిబిషన్ ? ఎక్సైజ్ స్టేషన్, చెవెళ్ల, రంగారెడ్డి జిల్లా ప్రాంగణంలో నిర్వహించబడును.

ఈ వేలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించబడుచున్నది.

వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:వాహన వివరాలు: వాహనం నం: టీజీ08 క్యూ 4291మోడల్: హోండా మోటార్ సైకిల్ ? స్కూటర్ (ఎస్ 125 డ్రమ్ బిఎస్–)

అంచనా విలువ: 52,000/- వాహనం నం: టి ఎస్ 11 ఈ ఎల్7414

మోడల్: సుజుకి మోటార్ సైకిల్ (యాక్సెస్ 125 బి ఎస్–)

అంచనా విలువ: 12,000/-పై వాహనాలు “యాస్ ఈజ్ వెర్ ఈజ్” పద్ధతిలో వేలం ద్వారా విక్రయించబడును.వేలం నిబంధనలు: వేలంలో పాల్గొనదలచిన వారు చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రం సమర్పించవలెను విజయవంతమైన బిడ్డర్ వెంటనే నిర్దేశిత మొత్తాన్ని చెల్లించవలెను వాహనాలు ప్రస్తుత స్థితిలోనే అప్పగించబడును శాఖ నిర్ణయం తుదిగా పరిగణించబడును ఇతర నిబంధనలు కార్యక్రమ స్థలంలో తెలియజేయబడునుస్థలం: ప్రొహిబిషన్ ? ఎక్సైజ్ స్టేషన్, చెవెళ్ల, రంగారెడ్డి జిల్లాతేది: 18-03-2026సమయం: ఉదయం 10:30 గంటలకుప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వేలంలో పాల్గొనగలరు.

# క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అక్రమాల ఆరోపణలు

- చైర్మన్, ఈవోపై స్థానికుల విమర్శలు
- సమగ్ర విచారణకు డిమాండ్

**మేడ్చల్, మేజర్ న్యూస్ (మార్చి, 17):** ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనాపూర్ గ్రామంలో ఉన్న శ్రీ క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో చైర్మన్ భక్తిరాజు దివాకర్ రావు, ఆలయ ఈవో వెంకన్న ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆలయ కమిటీ నిర్ణయాలను పక్కనపెట్టి నిబంధనలను ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హుండీ లెక్కించాల్సి ఉండగా, హుండీకి తాళం వేయకుండా లెక్కలు నిర్వహించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీంతో దేవస్థానానికి వచ్చే ఆదాయం పై స్పష్టత లేదని ఆరోపించారు. అభివృద్ధి పనుల పేరుతో


ఘనాపూర్ గ్రామంలోని శ్రీ క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్


ఘనాపూర్ గ్రామంలోని శ్రీ క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయం

జరుగుతున్న ఖర్చుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు దేవస్థానం కమిటీ ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే దేవస్థానం పరిధిలోని సర్వే నంబర్ 49లో ఉన్న 35 గుంటల భూమి కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలపై సమగ్ర విచారణ జరిపి ఆలయ చైర్మన్ దివాకర్ రావు, ఈవో వెంకన్నలపై దేవాదాయ శాఖ కమిషనర్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సొంత నిధులతో మసీదుకు సౌకర్యాల ఏర్పాటు

- ప్రశంసలు అందుకుంటున్న మణికంఠ గౌడ్
- రాయిలాపూర్ పెద్ద మసీదులో బాత్రూంలు, సెప్టిక్

ట్యాంక్ నిర్మాణం ? ఇఫ్తార్ విందు నిర్వహణ

**మేడ్చల్, మేజర్ న్యూస్ (మార్చి, 17):** ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని రాయిలాపూర్ గ్రామంలోని పెద్ద మసీదుకు మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు రామన్న గారి మణికంఠ గౌడ్ తన సొంత నిధులతో రెండు బాత్రూంలు, ఒక సెప్టిక్ ట్యాంక్ నిర్మించి అందజేశారు. గత కొద్ది రోజులుగా మసీదులో బాత్రూం సౌకర్యం లేక ముస్లిం సోదరులు ఇబ్బందులు పడుతున్న విషయం ఆయన దృష్టికి రావడంతో సుమారు లక్ష రూపాయల వ్యయంతో ఈ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. దీంతో ముస్లిం సోదరులు మణికంఠ గౌడ్ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ,... సమస్యను తెలియజేయగానే వెంటనే స్పందించి మసీదుకు అవసరమైన సౌకర్యాలను కల్పించడం అభినందనీయమని



పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాయిలాపూర్ పెద్ద మసీదులో మణికంఠ గౌడ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మణికంఠ గౌడ్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# కరెంటు సారు టైంకి రారు– కౌన్సిలర్‌ల వినూత్న నిరసన

- విద్యుత్ ఏఈ గైర్హాజరుపై కుర్చీకి వినతిపత్రం
- లో వోల్టేజ్ సమస్యల పరిష్కారం డిమాండ్

**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (మార్చి 17):** మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ 13వ వార్డు,14వ,వార్డ్ కౌన్సిలర్ లు చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి,జంగారెడ్డి లు వినూత్న నిరసనకు దిగారు. విద్యుత్ ఏఈ కార్యాలయం మూసి ఉండడంతో కుర్చీకి వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే ఎంసీ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగన్‌గూడ గ్రామంలో లో వోల్టేజ్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోయిందని కౌన్సిలర్ లు తెలిపారు. విద్యుత్ అధికారి వెంకటనారాయణకు లిఖితపూర్వకంగా వినతిపత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కరించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మరోసారి అలియాబాద్ విద్యుత్ కార్యాలయానికి వెళ్లి సమస్యలను వివరించేందుకు ప్రయత్నించగా ఏఈ గది తాళం వేసి ఉండటంతో పాటు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదన్నారు. దీంతో ఆగ్రహించిన


అలియాబాద్ విద్యుత్ కార్యాలయంలో ఏఈ కుర్చీకి వినతిపత్రం అందజేస్తూ, వినూత్న నిరసన తెలుపుతున్న కౌన్సిలర్‌లు

కౌన్సిలర్ ఏఈ కుర్చీకి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఏఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మల్లారెడ్డి కాలనీలో ట్రాఫిక్ నియంత్రణ కొరకు అధికారులతో చర్చిస్తా -శాంతి శ్రీనివాస్ రెడ్డి

ఆల్వాల్, సూర్య (మేజర్ న్యూస్ ): ఆల్వాల్ మల్లారెడ్డి కాలనీ లో ట్రాఫిక్ నియన కొరకు అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించే ందుకు కృషి చేస్తానని మాజీ ఆల్వాల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మల్లారెడ్డి కాలనీ వాసులు ట్రాఫిక్ వల్ల ఇబ్బందులను ఎదురుకుంటున్నామని చేసిన పిర్యాదు మేరకు మంగళవారం పట్టణ ప్రణాళికావిభాగం ఎ. సి. పి., శ్రీనివాస్ రెడ్డి తో కలసి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని అంచనా వేయాడానికి కాలనీ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీవాసులతో మాట్లాడారు. ట్రాఫిక్ వల్ల ఎదురౌతున్న ఇబ్బందులను, రద్దీ ని నియాంత్రించి వాహనాలా రాకపోకలను



సులభతరం చేసేందుకు చంద్రాపురం కాలనీ గుండా వెళ్లే ప్రత్యామ్నాయ రహదారిని క్లియర్ చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలనీ వాసులు ఆమెకు విన్నవించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు విశ్వేశ్వర రావు అధ్యక్షులు, నిఖిల్ కార్యనిర్వాహక అధ్యక్షులు, కిరణ్ ప్రధాన కార్యదర్శి, హరి ప్రసాద్ ఉపాధ్యక్షులు, రమణ మూర్తి కోశాధికారి, భాస్కర్ రావు సలహాదారు , కాలనీ వాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ చేతి వృత్తిదారుల ధర్నా!



ముషీరాబాద్,మేజర్‌న్యూస్ : తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద గల ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. మొత్తం 11 వృత్తిదారుల సంఘాలు ఈ ధర్నాలో పాల్గొన్నాయి. 2026–27బడ్జెట్‌లో వృత్తిదారుల సంక్షేమం కోసం రూ.25వేల కోట్లు కెటాయించాలని నేతలు కోరారు. గత బడ్జెట్‌లో కెటాయించిన నిధులు మొత్తం ఖర్చుచేయాలని కోరారు. బీసీ సబ్‌ప్లాన్‌చట్టం చేయాలని డిమాండ్ చేసారు. మేనిఫెస్టోలో వృత్తిదారులకు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. వృత్తిదారులు అందరికి పెన్షన్ ,ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలిపారు.బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను అన్నిరంగాల్లో అమలు చేయాలని నేతలు డిమాండ్ చేసారు.సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యంవీరమణ, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం–కూరెళ్ళనరసింహాచారి,రాళ్ళబండి కుమారస్వామి, మత్స్యకార్మిక సంఘం–గోరెంక ల నర్సింహా,లెల్లెల బాలకృష్ణ, గొర్రెలు, మేకలు పెంపకదారుల సంఘం –కే.గోపాల్,ఉడుత రవీందర్ పాల్గొన్నారు.రజక, కల్లుగీత ,వడ్డెర, బ్యాండ్ వాయిద్య కళాకారులు,క్షౌర,,ఒగ్గు కళాకారులు–తదితర వృత్తిదారుల సంఘం ప్రతినిధులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

## ‘వరల్డ్స్ అపార్ట్’ పుస్తక ఆవిష్కరణ




హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : గ్లోబల్ లీడర్‌షిప్ నిపుణుడు ఎడ్ కోహెన్ రచించిన “వరల్డ్స్ అపార్ట్: ఎ ట్రూ స్టోరీ ఆఫ్ కరేజ్, కనెక్షన్ అండ్ చేంజ్” పుస్తకాన్ని హైదరాబాద్‌లో ఆవిష్కరించడం అభినందనీయని ఐకెవా బోర్డు సభ్యురాలు అర్చన నాయుడు తెలిపారు.ఈ మేరకు హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ హోటల్ లొ నిర్వహించిన ఐకెవా వార్షిక సమావేశం లొ అర్చన నాయుడు మాట్లాడుతూ... నాయకత్వం, ఆలోచనల మార్పిడి, ప్రొఫెషనల్ సంబంధాల బలోపేతానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. వర్చువల్‌గా పాల్గొన్న ఎడ్ కోహెన్, తన పుస్తకం భారతదేశంలో విడుదల కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ పుస్తకం తనతో పాటు సహరచయిత్రి దేవి బొడ్డు జీవిత అనుభవాల ఆధారంగా రూపుదిద్దుకున్నదని తెలిపారు.ఇందులో వ్యాపారవేత్తలు, కార్పొరేట్ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యా కమిషన్ నివేదికపై చర్చ!




ముషీరాబాద్,మేజర్‌న్యూస్ : తెలంగాణ విద్యాకమిషన్ నివేదిక పై చర్చా కార్యక్రమం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో (బాగ్‌లింగంపల్లి)లో ఫోరం ఫర్ డిబేట్ సంస్థ నిర్వహించింది.ప్రొఫెసర్లు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, రిటైర్డ్ టీచర్స్ ఈ చర్చలో పాల్గొన్నారు.ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ విద్యాకమిషన్ నివేదిక మన రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగుకు దోహదపడుతుందని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన విద్యావ్యవస్థలో సంస్కరణలకు అవకాశం ఉందని నివేదిక చెబుతుందని అన్నారు. పాజిటివ్‌గా నివేదికను గుర్తించి స్వాగతించాలని సూచించారు.విద్యారంగానికి చెందిన పలువురు నేతలు నివేదిక–ను తప్పు పట్టారు. మన తెలంగాణ రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వ విద్యను అడ్డుకునేలా ఈ నివేదిక ఉందని, ఇది చెత్త నివేదిక అని విమర్శించారు. నివేదకను ప్రభుత్వం వెంటనే తిరస్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యావేత్తలు, ఉపాధ్యాయనేతలు, విద్యార్థిసంఘాల నేతులువీరే–ప్రొ.ఎల్ .లింబాద్రి, ప్రొ.ఏ.వినయ్‌బాబు జేఎన్‌టీయూ, ప్రొ.కే.లక్ష్మీనారాయణ(సెంట్రల్ యూనివర్సిటీ), ప్రొ.బి.శివారెడ్డి (మహాత్మాగాంధి యూనివర్సిటీ),ఓ.నర్సింహారెడ్డి, ఏ.జయంతి,ఎంవీ గోనారెడ్డి, ఉపాధ్యాయసంఘాల నేతలు–సీహెచ్ అనిల్‌కుమార్,సీహెచ్.రవి,దామోదర్‌రెడ్డి, విద్యార్థి సంఘాల నేతలు–మహేశ్,అనిల్,పృథ్వీ, విజయ్,నాగరాజు, మణికంఠ...తదితరులు ఈ చర్చలో పాల్గొన్ని ప్రపంచీకరణ, సరళీకరణ నేపథ్యంలో ప్రపంచబ్యాంక్ విధానాలకు,కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఈ విద్యాకమిషన్ కమిటీ నివేదిక ఉందని ఆగ్రహం వ్యక్తం చేసారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలి

## – కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్







కొందుర్గు, మేజర్‌న్యూస్(మార్చి 17): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సంఖ్యను పెంచాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ కానున్న కొందుర్గు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం త్వరలోనే 30 పడకల ఆసుపత్రిగా మారుతుందని

జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ లలితాదేవి తెలిపారు. ఇందుకోసం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వైద్య విధాన పరిషత్ కమీషనర్‌కుఉత్తరం వ్రాశారని, 30 పడకల ఆసుపత్రిగా మారితే, డాక్టర్ల కొరత, సిబ్బంది కొరత ఉండదని అన్నారు. రెండు మండలాలకు సంబంధించి కొందుర్గులోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని, జిల్లేడ్-చౌదరిగూడ మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం మూడు రోజుల క్రితం ఉన్నతాధికారులకు నివేదిక పంపించడం జరిగిందని, ఇందుకోసం కావలసిన భూమిని స్థానిక తహాశీల్దార్ చూయించారని, పిహెచ్‌సి ఏర్పాటుకు కావలసిని నిధులు కూడా మంజూరు అయ్యాయని, రెండు సంవత్సరాల్లో పిహెచ్‌సి నిర్మాణం కానుందని తెలిపారు. జిల్లాలో 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెగా వైద్య శిబిరాలను 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించడం జరుగుతుందని, మెగా వైద్య శిబిరాల్లో స్త్రీలకు 60 రకాల పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, మెగా వైద్య శిబిరాల్లో మహేశ్వరం జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి వనస్థలిపురం నుంచి ఆరుగురు స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని, శిబిరాల్లో స్త్రీలకు గర్భాశయ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, రిపోర్టులు మూడు రోజుల్లో వస్తున్నాయని, ముందస్తుగా పరీక్షలు నిర్వహించడం జరగుతుందని, ప్రతి రిపోర్టును ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని, రిపోర్టుల పరిశీలన అనంతరం అవసరమైతే ఉస్మానియా ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రి, నీలోఫర్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రికి పంపించడం జరగుతుందని, 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల్లో ఉన్న బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్‌ను షాద్‌నగర్ ఆసుపత్రిలో ఇవ్వడం ప్రారంభించడం జరిగిందని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మూడు డోసులు ఇస్తారని, ఒక్కో డోసుకు 4వేలు ఖర్చు అవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా సింగిల్ డోస్‌గా ఇవ్వడం జరుగుతుందని, బాలికలకు తప్పని సరిగా వ్యాక్సిన్ వేయించాలని కోరారు. వైద్య శిబిరంలో 80 మందికి గైనిక్ సమస్యలు, 71 మందికి ఆర్థో సమస్యలు, 89 మందికి కంటి సమస్యలు, 44 మందికి దంత సమస్యలు ఉన్నాయని గుర్తించారు. మరో 19 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. 129 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. 62 మందికి ల్యాబ్ పరీక్షలు, 12 మంది మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిప్యూటీ డిఏం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, మండల వైద్యాధికారిణి డాక్టర్ అమృతాజోసఫ్, కొందుర్గు ఉప సర్పంచ్ సి చంద్రశేఖర్, వార్డు సభ్యులు వెంకటేష్, నవీన్, శ్రీకాంత్, శ్రీను, ప్రవీణ్, లింగం, వాసురి, ఏపిఏం హరిలాల్, హెల్త్ ఎడ్యుకేటర్ జె శ్రీనివాస్, ముత్యాలు, సురేఖ, రాఘవులు, ఆశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ భూబాధితులకు న్యాయం చేయాలి

- లంబాడిల పట్టా భూములను ప్రోహిబిటేడ్ జాబితా నుండి తొలగించాలి
- 330 ఫీట్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్డును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి
- సంపన్నవర్గాలకు రియల్ ఎస్టేట్ వ్యాపారం కొరకు లంబాడీల భూములు కట్టబెడతారా
- లంబాడహక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబల్ నాయక్, ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్‌నాయక్



కడ్తాల్, మేజర్‌న్యూస్ (మార్చి 17): గ్రీన్ ఫీల్డ్ రోడ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సంపన్నవర్గాల రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు లంబాడీల భూములు కట్టబెట్టజూస్తున్నట్లు లంబాడహక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబల్ నాయక్, ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్‌నాయక్‌లు ఆరోపించారు. నిరుపేద లంబాడీలకు ఉన్న కొద్దిపాటి భూములు కోల్పొయేలా ప్రభుత్వం చేపడుతున్న 330 ఫీట్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్డును తక్షణమే రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు. లంబాడహక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని మంగలిగడ్డ తాండ, మర్లకుంట, వాయలికుంటతాండ, కుర్మిద్ద తాండా పోతు బండ తండ దాదాపుగా 18 తండాలకు సంబంధించిన గిరిజన రైతులకు సంబంధించిన భూముల్లో నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం, నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబల్ నాయక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్, రాష్ట్ర గిరిజన నాయకులు కిషన్ నాయక్‌లు హాజరుకాగా వివిధ తాండాల రైతులు, భూబాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ గతంలో ఫార్మసిటీ పేరు మీద 14 వేల ఎకరాల భూములను సేకరించగా, ప్రస్తుత ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోర్త్ సిటీ పేరుతో అభివృద్ధి కార్యక్రమాల కొరకు వందలాది లంబాడీల భూములను గుంజుకొని సంపన్న వర్గాలకు కట్టబెట్ట జూస్తున్నట్లు మండిపడ్డారు. లంబాడీలకు ఉన్న కొద్దిపాటి పట్టా భూములను తీసుకొని ప్రొహిబిటెడ్ లిస్టులో పెట్టి ఆ భూములను పంచుకోవాలని ప్రభుత్వం రియాల్టర్లు ప్రయత్నం చేస్తున్నారని వారు అనుమానం వ్యక్తం చేశారు. అదే చుట్టుపక్కల గ్రామాలలో వారి కులాలకు సంబంధించిన భూములను ప్రోహిబిటెడ్ లిస్టుల నుండి తీసివేసి అక్కడ తండాలకు సంబంధించిన లంబాడీల భూములు, ఎస్సీల భూములు, బీసీల భూములను తీసుకొని సంపన్నవర్గాలకు సంబంధించిన భూములను తీసివేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వంలో వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి రాష్ట్రంలో లంబాడి భూముల పైన పడి వారి భూములను గుంజుకొని వారి సామాజికవర్గాలను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కేటాయిస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో మంత్రులుగా ఉన్న కొంతమంది తమ అనుచరుల పేర్ల మీద వందల ఎకరాలు భూములను సంపాదిస్తుంటే మా గిరిజనుల భూములను ఎకరా రెండెకరాలు ఉన్న పట్టా భూములను మా భూములను కాజయాలని ప్రయత్నం చేస్తూ ఉన్నారని రాంబల్‌నాయక్, దశరథ్‌నాయక్‌లు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 330 ఫీట్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్డును తక్షణమే రద్దు చేయాలని, ఈ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఆనుకొని ఉన్న లంబాడీల పట్టా భూములను ప్రొహిబిటెడ్ లిస్టు నుండి తీసివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం నిరాహార దీక్షలో తాండ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

- రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ - షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర




షాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 17)ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించే ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర అన్నారు. షాబాద్ మండల పరిధిలోని నాగర్ కుంట గ్రామం ప్రకృతి వ్యవసాయ సాగుకు ఎంపిక కావడంతో మాచనపల్లి రైతు వేదికలో నాగర్ కుంట గ్రామ రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ మిషన్ ఫర్ నేచరల్ ఫార్మింగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామ సర్పంచ్ పాలమాకుల మల్లయ్య ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం ఎంపికైన రైతులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తక్కువ ఖర్చుతో రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించి అధిక లాభాలను పొందవచ్చు అన్నారు. నాగరకుంట గ్రామంలో 125 మంది రైతులు ప్రకృతి వ్యవసాయానికి ఎంపిక అయ్యారని, వారికి ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన కిట్లను అందజేశామన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ముడిపదార్థాలు, సహజంగా లభించే ఘనామూర్తం, జీవామృతం లాటివి పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన 125 మంది రైతుల దగ్గర మట్టి నమూనాలు సేకరించి వారికి భూపరీక్ష పత్రాలను అందజేశామన్నారు. భూపరీక్ష ఫలితాలను బట్టి సమతుల్యతలను పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. విరివిగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతిలో సహజంగా లభించే సహజ వనరులను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి గాయత్రీ, క్రిషిసఖి శ్రీలత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## షాబాద్ మండలం యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా పార్వతి భాస్కర్



షాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 17)షాబాద్ మండల యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియామక పత్రాన్ని చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ పామెన భీమ్ భరత్ చేతుల మీదగా తీసుకున్నట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పామెన భీమ్ భరత్ మాట్లాడుతూ ... యువకులు రాజకీయాలపై అవగాహన పెంచుకొని,సమాజ సేవ కోసం ముందుకు రావాలని తెలిపారు. పార్వతి భాస్కర్ మాట్లాడుతూ... యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి ఆశీస్సులతో ఈ అవకాశం వచ్చిందన్నారు. యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గా నాకు బాధ్యతలు కల్పించిన కాంగ్రెస్ పార్టీకి చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ భీమ్ భరత్ అన్న కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ సేవలు అందరికీ అందే విధంగా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చెన్నయ్య, సురేందర్ ,యాదయ్య తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాల పంపిణీ



షాబాద్, మేజర్ న్యూస్ (మార్చి 17)షాబాద్ మండల కేంద్రం లోని హోలీ స్పిరిట్ హైస్కూల్లో సి ఎస్ ఆర్ ఎం సి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్ రెడ్డి చిత్తా దంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి టి.శ్రీను పాఠశాలలో చదువుతున్న బాలబాలిలకు లైబ్రరీ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలోని పేద పిల్లలకు సహాయ సహకారం అందించాలనే ఉద్దేశంతో మా వంతు సహాయంగా విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సంగీత, సిస్టర్ నిత్య, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొని సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.